సాహితీ యోధుడు, అక్షర వాచస్పతి

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు

# దాశరథి రంగాచార్య

## స్మృత్యంజలి



నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

సాహితీ యోధుడు.. అక్షర వాచస్పతి

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు

# దాశరథి రంగాచార్య

## స్మృత్యంజలి

సాహితీ యోధుడు.. అక్షర వాచస్పతి

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు

# దాశరథి రంగాచార్య

## స్మృత్యంజలి

నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

ప్రచురణ సంఖ్య : 1359

ప్రథమ ముద్రణ : జూన్, 2015

వెల : ₹ 30/-

ప్రతులకు

**నవ తెలంంగాణ పబ్లిషింగ్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

బ్రాంచీలు

హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.

నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక

నివాళి ........................................................ 6

అక్షర శిఖరం అస్తమయం ........................................ 7

ప్రముఖుల సంతాపం .............................................. 10

**సంపాదకీయ వ్యాఖ్యలు : ...................................... 17**

తెలంగాణ గుండె చప్పుడు .............................. 17

అక్షర యోధుడు ............................................ 19

అభినవ వ్యాసుడు .......................................... 22

మోదుగుపువ్వు రాలింది .................................. 24

అరుదైన కలం .............................................. 26

తెలుగు ప్రజల గోర్కీ ............................................. 29

దాశరథి సృజనలో తెలంగాణ గుండె చప్పుడు .................. 31

విలక్షణ అక్షరయానం .............................................. 39

మన కాలపు మహామనీషి............................................ 42

జీవితాన్ని నేర్పింది కమ్యూనిస్టు ఉద్యమం ........................ 47

జీవితాన్ని చదివి, నేర్చుకొని రాయాలి ............................ 55

"ఆ ఆవేశమే నన్ను నడిపించింది" ................................ 62

అవార్డులు ............................................................ 70

దాశరథి రంగాచార్య రచనలు .................................... 71

# నివాళి

**క**డదాకా ప్రజలకోసమే తన కలాన్ని ఉపయోగించిన ధన్యజీవి డాక్టర్ దాశరథి రంగాచార్యకు నవతెలంగాణా పబ్లిషింగ్‌హౌస్ సమర్పిస్తున్న అక్షరాంజలి ఇది. పుట్టింది అగ్రకులంలోనే అయినా కడుపేదరికం అనుభవించిన దాశరథి ఆనాటి పేదల బ్రతుకులను సంపూర్ణంగా అర్థం చేసుకొని వారి కడగండ్లను కళ్లకు కట్టినట్లు తన రచనల్లో ప్రతిబింబించారు. నిజాంనిరంకుశ పాలనలో దేశ్‌ముఖ్‌ల, జాగిర్దార్ల క్రూర చర్యలను, పచ్చి ఫ్యూడల్ దోపిడీని ప్రజల భాషలో అక్షరరూపం ఇచ్చి ఆ ప్రజలను మేల్కొలపడానికి తన రచనలను సాధనంగా అందించారు దాశరథి. తానూ నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి ముందు, సాయుధ పోరాటం రోజుల్లో, అనంతర కాలంలో తెలంగాణా జీవనాన్ని అద్దం పడుతూ శాశ్వతంగా నిలిచిపోయే 'చిల్లర దేవుళ్లు', మోదుగుపూలు', 'జనపథం' నవలలను రచించారు. సూటిగా చెప్పాలంటే ఆ మూడు నవలలు ఆ కాలానికి నవలల రూపంలోని డాక్యుమెంట్లు. ఆనాడు ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా రచనలు చేసినా, తర్వాత ఆధ్యాత్మిక రచనలు చేసినా ప్రజాప్రయోజనం కోసమే తాను కృషిచేస్తున్నానని సంపూర్ణంగా విశ్వసించారు దాశరథి. ఆయన జీవిత కాలంలో చేసిన రచనా వ్యాసంగం ఎందరిని ప్రభావితం చేసిందో ఆయన కన్నుమూసిన నాడు అన్ని వైపుల నుండి అసంఖ్యాకంగా వచ్చిన సందేశాలు, స్వయంగా భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించిన ఎందరో ప్రముఖులను గమనిస్తే తేలిగ్గా అర్థమవుతుంది. అలాంటి మహనీయునికి అంజలి ఘటిస్తూ నవతెలంగాణా పబ్లిషింగ్‌హౌస్ ఈ చిన్న ప్రచురణను తీసుకువస్తున్నది.

**- నవతెలంగాణా పబ్లిషింగ్‌హౌస్**

హైదరాబాద్

# అక్షర శిఖరం అస్తమయం

**నా** తెలంగాణ కోటి రతనాల వీణ అంటే గుర్తుకొచ్చేది దాశరథి కుటుంబం. ఆ నినాదమే ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ప్రఖ్యాత సాహితీవేత్త దాశరథి రంగాచార్య (89) కన్నుమూశారు. అక్షర శిఖరం అస్తమయమైంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఉన్న యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస (8-06-2015న) విడిచారు. దాశరథి రంగాచార్య మృతితో సాహితీలోకం మూగబోయింది. ఆయన సంప్రదాయ సాహిత్య, నవల, కథానిక, వ్యాఖ్యాత, వ్యాస, విమర్శ, అనువాద రచయితగా ప్రఖ్యాతిగాంచారు. రేడియో, దూరదర్శన్, చలనచిత్రాలకూ తన సాహిత్యాన్ని అందించి సేవలందించారు. దాశరథి రంగాచార్యకు భార్య కమల, కుమారుడు దాశరథి విరించి, ఇద్దరు కుమార్తెలు కెవి ఉదయశ్రీ, కె సుధ ఉన్నారు. గత కొంతకాలంగా ఆయన బిపి, షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయనను యశోదా ఆస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో సోమవారం ఉదయం ఆరు గంటలకు ఆయన మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని సికింద్రాబాద్‌లోని వెస్ట్‌మారేడ్‌పల్లిలో ఉన్న స్వగృహానికి తరలించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. మధ్యాహ్నం 12 గంటలకు (9-06-2015, మంగళవారం) వెస్ట్‌మారేడ్‌పల్లిలోని శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సోమవారం ఆయన మరణవార్త తెలియగానే ప్రభుత్వ ప్రతినిధులు, రాజకీయ నాయకులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## అభ్యుదయ రచనలతో ప్రజల్లో చైతన్యం

దాశరథి రంగాచార్యకు ఆయన అన్న దాశరథి కృష్ణమాచార్యులు ఎంతో ప్రేరణిచ్చారు. ఆయన స్ఫూర్తితోనే సాహితీరంగంపై ఆసక్తి కనబరిచారు. చిన్నతనం నుంచే రచనలపై మక్కువ పెంచుకున్నారు. విప్లవ భావాలతో కూడిన అభ్యుదయ రచనలు, మరోవైపు ఆధ్యాత్మిక భావాలతో కూడిన సాహిత్యాన్ని అందించడం ఆయనకే చెల్లింది. నిజాం పాలనకు వ్యతిరేకంగా ఎన్నో పుస్తకాలు రచించారు. ఒకవైపు పెన్నుతోను, మరోవైపు గన్నుతోను నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. దాశరథి రంగాచార్య అభ్యుదయ రచనలు ప్రజలను విశేషంగా చైతన్యపరిచాయి. చిల్లర దేవుళ్లు (1969), మోదుగుపూలు (1971), రానున్నది ఏది నిజం? (1974), జనపదం (1976), మానవత (1978), శిరతల్పం (1978), మాయజలతారు (1973), పావని ఎంతో ప్రఖ్యాతిగాంచాయి. 'కనిపెంచినట్టి కరుణామయి నా తెలంగాణ. తెలంగాణ పోరాటం నన్నెంతో ప్రభావితం చేసింది. ఆ స్ఫూర్తితో 1938కి పూర్వం ప్రజల జీవితాలను చిల్లర దేవుళ్లు, 1942-48 వరకు ఉన్న పోరాటాన్ని మోదుగుపూలు, 1948-67 వరకు రెండుదశాబ్ధాల జనజీతితాన్ని జనపదంలో చిత్రీకరించాను. రానున్న భారతదేశపు స్వరూపాన్ని, నేను కన్న కలల్ని రానున్నది ఏది నిజం?లో చిత్రించాను'అని దాశరథి రంగాచార్య సగరంగా ప్రకటించారు. జీవనయానంలో ఆత్మకథను రచించారు. ఈ నవలలు విశ్వఖ్యాతి పొందాయి. ఎంతో మంది సాహితీప్రియులకు ప్రేరణనిచ్చాయి. చిల్లర దేవుళ్లు నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. తెలుగు సాహిత్య చరిత్రలో ఆయనకు సుస్థిర స్థానం ఉంది. తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి సరళంగా అనువదించిన మహాకవి దాశరథి రంగాచార్య. శ్రీమద్రామాయణం, శ్రీమహాభారతాలను సరళంగా తెలుగులో రచించారు. అభినవ వ్యాసుడిగా బిరుదు పొందారు. దేహదాసు ఉత్తరాలు, శ్రీమహాభారతము, జీవనయానం, చతుర్వేద సంహిత, అమృత ఉపనిషత్తు, అమృతంగమయ, వేదం, జీవననాదం, ప్రవేశిక, సీతాచరితం, శ్రీమద్రామాయణము విశేష ఆదరణ పొందాయి.

## వరంగల్‌లో పుట్టి... ఖమ్మంలో పెరిగి... హైదరాబాద్‌లో స్థిరపడి

దాశరథి రంగాచార్య 1928, ఆగస్టు 24న జన్మించారు. దాశరథి వెంకటాచార్యులు, వెంకటమ్మ దంపతులకు ఆయన రెండో సంతానం. స్వస్థలం వరంగల్ జిల్లాలోని చిన్నగూడూరు గ్రామం. నాలుగో తరగతి వరకు చిన్నగూడూరులో చదివారు.

అనంతరం ఖమ్మం వెళ్లారు. పరిస్థితుల ప్రభావం వల్ల ఖమ్మం జిల్లాలోని గార్లలో నివసించారు. నిజాం పాలనను చిన్నతనం నుంచే వ్యతిరేకించడంతో ఆయన చదువులకు ఆటంకం కలిగింది. 12వ ఏటలోనే నిజాంకు వ్యతిరేకంగా పోరాటం ఆరంభించారు. 17 ఏళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యారు. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాములకు, పెత్తందారులకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేశారు. విద్యాభ్యాసానికి ఇబ్బంది కలగడంతో విజయవాడకు వెళ్లి మెట్రిక్యులేషన్ పూర్తి చేసి వచ్చారు. 1951–57 మధ్య ప్రభుత్వ ఉపాధ్యానియునిగా పనిచేశారు. మొదట ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లిలో ఉపాధ్యాయునిగా సేవలందించారు. 1959లో హైదరాబాద్‌కు వచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసిహెచ్)లో అనువాదకుడిగా చేరారు. లైబ్రరియన్‌గా సేవలందించారు. 1957–88 వరకు 32 ఏళ్ళపాటు ఎంసిహెచ్‌లో ఉద్యోగం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ హోదా వరకు ఎదిగి 1988లో ఉద్యోగ విరమణ పొందారు. ఇక హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు.

## పిట్టకో గూడు... మనిషికో ఇల్లు

వెస్ట్‌మారెడ్‌పల్లిలోని ఇల్లు తప్ప దాశరథి రంగాచార్యకు వేరే ఆస్తుల్లేవ్. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే 10 ఎకరాల భూమి, ఇంటిస్థలం ప్రభుత్వం ఇస్తామన్నా ఆయన సున్నితంగా తిరస్కరించారు. 'ప్రజల కోసం పనిచేశామని, భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడాం. పేద ప్రజలకు భూమి, ఇంటిస్థలం అందాలి. ప్రభుత్వం వారికి అందించాలి. పిట్టకో గూడు... మనిషికో ఇల్లు అని దాశరథి రంగాచార్య అన్నారు'అని ఆయన తనయుడు దాశరథి విరించి నవతెలంగాణ ప్రతినిధితో చెప్పారు. తమ నాన్న ఆశయ సాధనలో తామూ భాగస్వాములమవుతాం. తమ నాన్న వద్దనున్నది తమకెందుకు?అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే ఫించన్లనూ తీసుకోవడం లేదు.

# ప్రముఖుల సంతాపం

## గవర్నర్, సిఎం

ప్రముఖ రచయిత దాశరథి రంగాచార్య మృతి పట్ల గవర్నర్ నరసింహన్, ముఖ్య మంత్రి కెచంద్రశేఖరరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. దాశరథి రంగాచార్య తన రచనల ద్వారా తెలంగాణ ూద్యమ భావజాల వ్యాప్తికి, పోరాటాల ద్వారా ప్రజల్లో సూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తిగా ఆయన చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోతారన్నారు. చిల్లర దేవుళ్ల లాంటి రచనల ద్వారా ఆయన సామాజిక స్ఫూర్తిని కూడా ప్రదర్శించారని కొనియాడారు. తెలుగు ప్రజలు ఒక గొప్ప రచయితను కోల్పొయారని గవర్నర్ నరసంహన్ అన్నారు. దాశరథి రంగాచార్య అంతక్రియలను ప్రభుత్వ అధికార లాంచనాలతో నిర్వహంచాలని సిఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మను ఆదేశించారు.

## నేటి తరానికి ఆదర్శం : రాఘవులు

అభ్యుదయ రచయిత దాశరథి రంగాచార్య అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లు స్వరాజ్యం, చెరుపల్లి సీతారాములు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన జీవితం ప్రజలకే అంకితమిచ్చారని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## ప్రజల హితం కోరిన గొప్ప సాహితీవేత్త : తమ్మినేని

దాశరథి రంగాచార్య మరణం విచారకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. సోమవారం దాశరథి స్వగృహానికి తమ్మినేనితోపాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి రాములు వెళ్లి నివాళు లర్పించారు. అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సమాజం, ప్రజలతో ఆయన కుటుంబానికి అవినాభావ సంబంధముందని తెలిపారు. అభ్యుదయ భావాలు, రచనలతో ప్రజల హితం కోరిన గొప్ప సాహితీవేత్త అని అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా రాసిన రచనలు ప్రజలను చైతన్యపరిచాయని చెప్పారు. తుపాకీని, కలాన్ని ఎక్కుపెట్టిన యోధుడని కొనియాడారు. ఇలాంటి గొప్ప వ్యక్తిని గౌరవించడం ప్రభుత్వానికే ఖ్యాతి దక్కుతుందని అన్నారు. అది ఆయనకిచ్చే గౌరవమని తెలిపారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కష్టాలు తొలగిపోయేందుకు సిపిఎం కృషి చేయాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. దోపిడీకి, పెత్తందారీతనానికి వ్యతిరేకంగా ప్రజల విముక్తికోసం తన రచనలతో అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## సిపిఐ సంతాపం

తెలంగాణ పోరాట యోధులు, సుప్రసిద్ధ రచయిత దాశరథి రంగాచార్య మృతిపట్ల సిపిఐ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంపై, భూస్వాముల దారణమైన దోపిడీపై ఆయన గొప్ప సాహిత్యాన్ని అందించారని తెలిపారు. సాహిత్యం ద్వారా పోరాటానికి అవసరమైన వెన్నుదన్ను సమకూర్చారని పేర్కొన్నారు.

## సిపిఎం నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ప్రఖ్యాత సాహితీవేత్త దాశరథి రంగాచార్య మృతిపట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. సోమవారం

ఎంబి భవన్‌లో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్, టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్, పాలడుగు భాస్కర్, సిపిఎం ఎపి రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ కమ్యూనిస్టు అభిమానులుగా జీవించారని చెప్పారు. సిపిఎం రాష్ట్ర తొలి మహాసభలు విజయవంతం కావాలని ఆశీస్సులు అందించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉన్నా, బలహీనంగా ఉన్నా సిద్ధాంతం పట్ల ఆయకున్న నిబద్ధత సడలలేదని చెప్పారు. సమాజ మార్పు కోసం పాటుపడ్డారని అన్నారు. తుదిశ్వాస విడిచే వరకు నమ్మిన ఆశయం కోసం నిలబ డ్డారని చెప్పారు. యువతరానికి ఆయన ఆదర్శ మన్నారు.

## పద్మశ్రీ ఇవ్వాల్సింది : వరవరరావు

దాశరథి రంగాచార్యకు పద్మశ్రీ అవార్డు ఇవ్వాల్సిందని కవి వరవరరావు చెప్పారు. కానీ ప్రభుత్వం ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆయన రచనలు, సాహిత్యం నేటి తరానికి ఎంతో మేలు కలిగిస్తాయని తెలిపారు. నాడు భూస్వాములు, పెత్తందారులు దోపిడీ చేస్తే, నేడు కార్పొరేట్ శక్తులు దోపిడీకి పాల్పడుతున్నాయని అన్నారు. దోపిడీ స్వరూపం మారింది తప్ప ఆయన కోరుకున్న సమాజం ఏర్పడలేదన్నారు.

## గొప్ప సాహితీవేత్తకు మా వందనాలు : గద్దర్

తెలంగాణకే గొప్ప సాహితీవేత్త దాశరథి రంగాచార్య అని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. ఆయన సాహిత్యంతో ఎంతో మంది ప్రేరణ పొందారని చెప్పారు. సామాన్యులను ఆయన రచనలు ఆకట్టుకున్నాయని వివరించారు.

## అరసం నివాళి

ప్రఖ్యాత రచయిత దాశరథి రంగాచార్య మరణం పట్ల అరసం జాతీయ నాయకులు ఎస్వీ సత్యనారాయణ సంతాపం ప్రకటించారు. 1970 దశకంలో అరసం పునర్నిర్మాణంలో క్రియాశీల పాత్ర పోషించారని తెలిపారు. అరసం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ఆయన మృతికి నివాళి అర్పిస్తున్నామని తెలిపారు.

## తెలుగు సాహిత్యానికి తీరనిలోటు : ఎంసిపిఐయు

దాశరథి రంగాచార్య మరణం తెలుగు సాహిత్యానికి తీరనిలోటని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మద్దికాయల అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో నాటి జమీందార్లు, నిజాం నిరంకుశ పాలనలో పేదలు అనుభవిస్తున్న వెట్టిచాకిరీ, దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో తుపాకి పట్టి కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. సామాజిక పరిస్థితులను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు.

## సృజనశీలి : లోక్‌సత్తా

తెలుగు భాషను, యాసను, సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సృజనశీలి దాశరథి రంగాచార్య అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా రంగాచార్య తన అక్షరాల్ని సంధించారని తెలిపారు. తను నమ్మినబాటలో క్షేత్రస్థాయిలో పోరాడారని పేర్కొన్నారు. ఆయన క్రియాశీల జీవనయానం తెలంగాణ సామాజిక గమనానికి అద్దం పడుతుందని తెలిపారు.

## ప్రజా ఉద్యమాలకు ఉత్తేజం : సాహితీస్రవంతి

ప్రసిద్ధ సాహితీవేత్త దాశరథి రంగాచార్య మృతికి సాహితీ స్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రధాన కార్యదర్శి వొరప్రసాద్ సంతాపం ప్రకటించారు. ఆయన రచనలు ప్రజా ఉద్యమాలకు, ప్రగతిశీల శక్తులకు ఎల్లప్పుడూ ఉత్తేజాన్ని అందిస్తాయని తెలి పారు. నిజాం పాలనలోని ప్రజల జీవన స్థితిగతులను తన నవలల్లో సజీ వంగా చిత్రించారని పేర్కొన్నారు. సామ వేదం నుంచి సామ్యవాదం వరకు బలమైన రచనలు చేశారని తెలిపారు. కలకాలం నిలిచే రచనలు చేసిన దాశరథి మృతి సాహిత్యరంగానికి తీరనిలోటని పేర్కొన్నారు.

## దాశరథికి అరుణాంజలి : ఎస్‌వికె

రంగాచార్యకు అరుణాంజలి అర్పిస్తున్నామని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, మాజీ కార్యదర్శి ఎస్

సాంబిరెడ్డి తెలిపారు. అభ్యుదయ రచయితల్లో ఆణిముత్యంలాంటి దాశరథి రంగాచార్య మృతి చెందడం పట్ల సంతాపం ప్రకటించారు. ఫ్యూడల్, రాజరిక దుర్మార్గాలకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తికోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా ఆయన చేసిన రచనలు అజరామరమైనవని తెలిపారు.

## దాశరథికి జోహార్లు : టిపిఎస్‌కె

ప్రఖ్యాత సాహితీవేత్త దాశరథి మృతికి జోహార్లు అర్పిస్తు న్నామని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టిపిఎస్‌కె) ప్రక టించింది. దాశరథి మరణం కవితా, రచనా లోకానికి, సాంస్కృ తిక కళారంగానికి తీరనిలోటని టిపిఎస్‌కె కన్వీనర్ జి రాములు, కో కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, బి బిక్షమయ్య, కె హిమ బిందు, ఎస్ వినయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కమ్యూ నిస్టు భావజాలంతో అనేక పుస్తకాలు రాశారని పేర్కొన్నారు.

## శాస్త్రీయ దృక్పథం కావాలన్నారు : జెవివి తెలంగాణ

దాశరథి మూఢనమ్మకాలు పోవాలని ఆకాంక్షించారని జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ప్రధాన కార్యదర్శి టి రమేష్ చెప్పారు. శాస్త్రీయ దృక్పథం కావాలని కోరుకున్నారని తెలిపారు. మట్టి వినాయకుడే గట్టి వినాయకుడని పర్యావరణ పరిరక్షణకు పాటుపడ్డారని అన్నారు. ఆయనతోపాటు సర్వేశ్వర్‌రావు, అరుణ్‌కుమార్‌లు నివాళు లర్పించారు.

## పిఎన్ఎం నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సాహితీవేత్త దాశరథి రంగాచార్య మృతికి ప్రజానాట్యమండలి నివాళి అర్పించింది. చిల్లర దేవుళ్లు, మోదుగుపూలు వంటి అద్భుతమైన నవలలు, వేదాలను తెలుగులోకి అనువదించిన మహనీయుడు అని పిఎన్ఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ మారన్న, టి నర్సింహ్మ తెలిపారు. మార్క్సిజాన్ని నమ్మి ఆ భావజాలాన్ని ప్రచారం చేశారని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా తన గళాన్ని, కలాన్ని వినియోగించారని తెలిపారు.

## మహాకవి మరణం తీరనిలోటు : తెలుగు విశ్వవిద్యాలయం

మహాకవి దాశరథి రంగాచార్య మరణం తీరనిలోటని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి తెలిపారు. తుపాకి పట్టడమే కాకుండా కలంపట్టి తెలంగాణ సాంస్కృతికాభ్యుదయానికి ఉత్తమ రచనలు అందించిన మహా రచయిత అని పేర్కొన్నారు. సాహిత్య జీవనానఇన, వ్యక్తిగత జీవనాన్ని అభ్యుదయ దృక్పథానికి, ఆధ్యాత్మికతకు సగంసగం పంచి ఇచ్చిన అరుదైన వ్యక్తి అని తెలిపారు.

## కాంస్య విగ్రహం నెలకొల్పాలి : తెలుగు భాషోద్యమ సమాఖ్య

దాశరథి కాంస్య విగ్రహం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై, వరంగల్‌లో మరొకటి నెలకొల్పి ప్రభుత్వం నివాళులర్పించాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రధాన కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి దాశరథి పేరును నామకరణం చేయాలని సూచించారు.

## జనసాహితి నివాళి

దాశరథి రంగాచార్య మృతికి జనసాహితి కార్యదర్శి భట్టు లక్ష్మినారాయణ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం సాహితీలోకానికి తీరనిలోటని నివాళి అర్పించారు.

## ఉన్నత విలువలున్న వ్యక్తి : హరగోపాల్

ఉన్నత విలువలు వ్యక్తీకరించుకున్న వ్యక్తి దాశరథి రంగాచార్య అని ప్రొఫెసర్ హరగోపాల్ చెప్పారు. ప్రజాస్వామిక గొంతుకలు ఉండడం ఎంత కీలకమో దాశరథి వంటి వ్యక్తులను చూస్తే తెలుస్తుందన్నారు. నిజాయితీకి ఆయన మారుపేరని అన్నారు. నిజాయితీగా బతకడం నేటితరానికి కష్టమైపోయిందని చెప్పారు. ఇలాంటి వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొందాలని, తెలంగాణ పునర్నిర్మాణం జరగాలని అన్నారు. ఆయన రచనలను ప్రజలకు అందుబాటులో తేవడమే ఆయనకిచ్చే నివాళి అని చెప్పారు. దాశరథి రంగాచార్య

భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో టిఆర్ఎస్ ఎంపీలు  కె కేశవరావు, కల్వకుంట్ల కవిత, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి శంకర్‌రావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి సాయన్న, సాక్షి ఎడిటోరియట్ బోర్డు డైరెక్టర్  కె రామచంద్రమూర్తి, జర్నలిస్టు పాశంయాదగిరితోపాటు పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు  ఉన్నారు.

## ప్రజాశక్తి మాజీ సంపాదకులు శ్రీనివాసరావు సంతాపం

దాశరథి రంగాచార్యులు మృతిపై ప్రజాశక్తి మాజీ సంపాదకులు వి శ్రీనివాసరరావు సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ప్రజల్ని ఉత్తేజపరిచే విధంగా సాహిత్యాలను అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దాశరథి రాసిన మోదుగుపూలు, చిల్లరదేవుళ్లు నేటికీ సజీవంగా నిలిస్తూ.. ప్రజలను, ప్రజా ఉద్యమాలను ఉత్తేజపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన జీవిత చరమాంకం వరకు సామాజిక, ప్రగతిశీల భావాలతో జీవించారని కొనియాడారు. 1942 అజ్ఞాతవాస కాలం నుంచి దాశరథికి ప్రజాశక్తితో ప్రగాఢ అనుబంధం ఉందని శ్రీనివాసరావు గుర్తు చేశారు. విజయవాడలో జరిగిన ప్రజాశక్తి 20వ వార్షికోత్సవానికి రంగాచార్యులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారని తెలిపారు. చాలా రోజుల పాటు ప్రజాశక్తికి తన సేవలందించారని పేర్కొన్నారు. దాశరథి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సంపాదకీయ వ్యాఖ్యలు

## తెలంగాణ గుండె చప్పుడు

క్రూర నైజాంను ఎదిరించి నిలిచిన తెలంగాణ వైతాళికులు దాశరథి రంగాచార్య ఈ లోకం నుంచి నిష్క్రమించారు. నిరంతరం తెగువతో, తెగింపుతో తెలంగాణ జనజీవన వారధిగా నిలిచిన ఆయన మనల్ని విడిచి వెళ్ళారు. లొంగుబాటు ఎరుగని వారి జీవనమే ఈ తరానికి స్ఫూర్తి. చెప్పాలనుకున్నది చెప్పి తీరాలనే వారి నిబద్ధతే సృజనశీలురకు దీప్తి. తెలంగాణ సాయుధపోరాట తరానికి చెందిన సాహిత్య యోధుని మరణం ఈ తరానికి తీరనిలోటు. చిన్నతనం నుంచి చివరిక్షణం వరకు తిరుగుబాటుతత్వంతో, ధిక్కారస్వరంతో నిరంకుశ పాలకుల్ని అభిశంసిస్తూ, ప్రజల పక్షాన నిలిచారు దాశరథి. కమ్యూనిస్టు పార్టీ ప్రభావంతో నైజాం పాలనకు వ్యతిరేకంగా పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో తుపాకి పట్టుకొని కదనరంగంలోకి ఉరికారు. అన్యాయాన్ని సహించలేని వారి ఆవేశమే ఆయన్ని ఉద్యమంలోకి నడిపించింది. నిర్భీతిగా మాట్లాడే వారి నైజం చాలాసార్లు మృత్యువు సమీపానికి తీసుకెళ్ళింది. పోలీస్‌ఠాణాలో ఉండి కూడా అక్కడి రికార్డుల్ని తగులబెట్టే ఆలోచన చేసిన ధీరత్వం దాశరథి రంగాచార్యది.

సాయుధపోరాట అనంతరం సికింద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తూ మున్సిపల్ కార్మికుల్ని ఏకంచేశారు. సంఘం పెట్టారు. సమస్యల పరిష్కారానికి సమ్మెలు చేయించారు. మాటకీ, చేతకీ నడుమ అంతరం లేని బతుకురీతిని అలవరుచుకున్నారు. కమ్యూనిస్టు ఉద్యమం జీవితాన్ని నేర్పింది. మనిషిని చేసిందనే దాశరథి వేదాలపై రాసినా, రామాయణం రచించినా కమ్యూనిస్టుగానే బతికారు. కమ్యూనిజం తన శ్వాస అని ప్రకటించారు. సమాజాన్ని దర్శించే సిసలైన దృక్కోణాన్ని మార్క్సిజం అందించిందని స్పష్టాతిస్పష్టంగా చెప్పిన ధీశాలి. సుదీర్ఘమైన బతుకుయానంలో ఎక్కడా జారిపోలేదు. ఏ ప్రలోభాలకీ

లొంగిపోలేదు. పోరాట కర్తవ్యాన్ని వీడలేదు. మొదట్లో తుపాకి పట్టిన ఆయన చేతులు తర్వాత కాలాన కలాన్ని ఆయుధంగా ధరించాయి.

తెలంగాణా సాయుధపోరాట కాలంలో వదిలిపెట్టిన చదువును కొనసాగించారు. రచయితగా తనదైన మార్గంలో ప్రయాణించారు. వారి రచనలు తెలంగాణ ఆత్మను ఆవిష్కరించాయి. తెలంగాణ గుండె చప్పుళ్ళను వినిపించాయి. తెలంగాణ పట్ల ఉన్న మమకారమే తెలంగాణ ప్రజల వెతల్ని, దొరల దౌష్ట్యాన్ని, నిజాం రాజుకు వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాగ్రహాన్ని చిత్రించే శక్తిని వారికి ఇచ్చింది. దాశరథి రచించిన తొమ్మిది నవలల్లో 'చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం' నైజాం కాలం నాటి జనజీవితాన్ని, రైతాంగ పోరాటాన్ని రూపు గట్టించాయి. దొరల, దేశ్‌ముఖ్‌ల దోపిడీ దౌర్జన్యాలతో అణగారిన ప్రజలు భూమి, భుక్తి, విముక్తి కోసం సంఘటితమై నిప్పుకణికల్లా ఎగిసిపడ్డ ఉద్యమచరిత్రను అక్షరబద్ధం చేశారు దాశరథి. పలు భాషల్లో పాండిత్యం ఉన్నప్పటికీ తను చెప్పాలనుకున్నది తెలంగాణ ప్రజల భాషలో చెప్పారు. తెలంగాణ జీవద్భాషకు సాహిత్య గౌరవాన్ని తీసుకొచ్చారు. రాయడం విధిగా, కర్తవ్యంగా భావించి రాశారు. ముందుతరాల వాళ్ళు నిజాం ఎక్కడ గొప్పవాడు అంటారేమోననే భయంతో ఆనాటి చరిత్రను చెప్పడానికి నవలలు రాశారు దాశరథి. ప్రజల తరుపున నిలబడ్డ కమ్యూనిస్టు యోధుల నిబద్ధతనీ, త్యాగశీలతనీ, మడమ తిప్పని శౌర్యాన్నీ తన రచనల్లో ప్రబలంగా చిత్రించారు.

మాక్సీమ్ గోర్కీ రచన 'అమ్మ' దాశరథికి బాగా ఇష్టమైన నవల. గోర్కీ తరహాలోనే ప్రజల కోసం పలు రచనలు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా పరిస్థితులు మారకపోవడాన్ని తన రచనల్లో చిత్రించారు. పోరాటపథం సామాన్యులకు అనివార్యమనే సత్యాన్ని ఆవిష్కరించారు. భూస్వామ్యదోపిడీ పీడనల్నించి విముక్తమయినప్పటికీ పాశ్చ్యతీకరణ, పారిశ్రామీకరణ కారణంగా అస్తవ్యస్థమైన గ్రామీణ జీవన విధ్వంసాన్ని చిత్రించారు. ఈ కారణంగా శ్రమైక జీవన సౌందర్యానికి స్థానం కల్పించే దశగా ఉద్యమపథంలో ప్రజలు ప్రయాణించక తప్పదనే వాస్తవాన్ని చివరిదశలో రాసిన నవలల్లో బలంగా చెప్పారు. సుదీర్ఘమైన తన జీవితకాలంలో దాదాపు యాభై పుస్తకాల దాకా రచించిన దాశరథి సృజనలో కలికితురాయిగా నిలిచే రచన 'జీవనయానం' ఇది తెలంగాణ ఆత్మగానం. తెలంగాణతో పాటు నడిచిన తననీ, తనతోపాటు నడిచిన తెలంగాణ చరిత్రనీ

చిత్రించిన ఈ ఆత్మకథ దాశరథిలోని ఉద్యమకారుడిని, సాహిత్యయోధుడిని, చరిత్రకారుడిని దర్శింపజేస్తుంది. తను పుట్టి పెరిగిన చినగూడూరు, గార్ల, బెజవాడ మొదలుకొని సికింద్రాబాద్ వరకు అల్లుకొని వున్న జీవనయానాన్ని చెప్పినతీరు అపురూపమైంది. తెలంగాణ సమాజ గమనాన్ని అత్యంత దగ్గరగా పరిశీలిస్తూ దానిని ఆవిష్కరించిన దాశరథి చారిత్రక దృష్టి, నిజాయితీ రచయితలకు ఆదర్శప్రాయం. కమ్యూనిస్టు ఉద్యమం జీవితాన్ని నేర్పింది, మనిషిని చేసింది. బతుకు సమాజంతో ఉన్నది అని చూపింది, కనుకనే సమాజ పరిణామాలతో, ఉద్యమాలతో ఎక్కువగా ప్రభావితమయి అంతిమక్షణాల వరకు కలం యోధునిగా నిలిచారు. దాశరథి. ఆ ప్రభావాల నేపథ్యంలోంచే దాదాపు అరవై సంవత్సరాలపాటు విస్తారంగా రచనలు చేశారు. ఆ రచనల వెలుగులో వారి నిజాయితీ, నిబద్ధతల్ని స్వీకరించి మన జీవితాచరణలో అంతర్భాగం చేసుకోవడమే దాశరథి రంగాచార్యకి మనం ఇచ్చే నిజమైన నివాళి.

**- నవతెలంగాణ**

**9 జూన్, 2015**

# అక్షర యోధుడు

**అ**భ్యుదయ రచయిత, తెలంగాణ అక్షరయోధుడు దాశరథి రంగాచార్య అస్తమించారు. జీవనయానంలోను, రాజకీయాల్లోను, సమాజంలోనూ అనేక మలుపులను, చారిత్రకఘట్టాలను ప్రత్యక్షంగా చూసి, మార్పుకోసం తన వంతు కృషిచేసిన రంగాచార్య ఎనిమిదిన్నర దశాబ్దాల వయసులో కాలధర్మం చెందారు. కడవరకూ అలసిపోని కలం యోధుడు ఆయన. తన జీవితంతో పెనవేసుకుపోయిన జనజీవితాన్ని అక్షరబద్ధం చేసిన చరిత్రకారుడు. సామ్యవాదం నుంచి వేదం దాకా సాగిన రచనా వ్యాసంగం ఆయనది. ఆయన వ్యక్తిత్వం ఎంతో విశిష్టమైనది. భిన్నధృవాలనుకొనే రెండు సిద్ధాంతాలను సమన్వయించి ఆచరించడానికి ప్రయత్నించిన అరుదైన రచయిత ఆయన.

నిజాం పాలనాకాలంలో జన్మించిన ఆయన అనేక పరిణామాలకు ప్రత్యక్షసాక్షి. అసమానతలకు, అణచివేతలకు నిలయంగా మారిన నాటి సమాజాన్ని గమనిస్తూ పెరిగిన ఆయనకు ఆయుధాన్ని అందుకోవాలన్నంత ఆగ్రహం కలగడంలో ఆశ్చర్యమేమీ లేదు. జన్మనిచ్చిన తండ్రి సనాతనవాదం కంటే, తనకు అన్నీతానై నిలిచిన అన్న కృష్ణమాచార్యుల సాంగత్యంలో అలవడిన అభ్యుదయభావాలు ఆయనను ముందుకు నడిపించాయి. ఆంధ్రమహాసభ, ఆర్యసమాజ్ బోధనలు కదనరంగంలోకి కదిలించాయి. తెలంగాణ విముక్తి పోరాటంలో చురుకుగా పాల్గొంటూ, నైజాం అనుకూలుర దాడులు ఎదుర్కొంటూ సోదరుడి బాటలోనే కదిలినా, అన్న అరెస్టుతో కౌమారప్రాయంలోనే కుటుంబ బాధ్యతలు ఆయన నెత్తినపడ్డాయి. ఉపాధి కోసం ఏవో ఉద్యోగాలు చేస్తున్నా, అసమానతలను ప్రశ్నిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సోదరుడి బాట వీడలేదు. పోరాటం కీలకదశలో ఉన్నప్పుడు కాంగ్రెస్ దళంలో చేరి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. ఆయుధంతో సాధించిన ఆ విజయాన్ని అక్షరబద్ధం చేయాలన్న సంకల్పం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది. ఆళ్వారుస్వామి అందించిన స్ఫూర్తితో తన ఆకాంక్షలను రంగాచార్య తన చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో అక్షరబద్ధం చేశారు.. పోరాటకాలం నాటి చరిత్రతో పాటు ఆ కాలానికి అటూ ఇటూ ఉన్న సామాజిక స్థితిగతులను కూడా అక్షరీకరించాలన్నది వారిరువురి సంకల్పం. అది సాహిత్యవేత్తల సామాజిక బాధ్యతన్నది వారి నిశ్చితాభిప్రాయం. ఆళ్వారుస్వామి మరణానంతరం ఆ సంకల్పాన్ని యథాశక్తిన పూర్తిచేసిన వారు రంగాచార్య. చిల్లరదేవుళ్ళు నవలకు కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం రావడం, సినిమాగా కూడా అద్భుత విజయాన్ని సాధించడం ఈ సందర్భంలో గుర్తుచేసుకోవలసిన విషయాలు. అదేవిధంగా, ఆయన ఆత్మకథ జీవన యానం అనేక తరాల జీవితాలను కళ్ళముందు ఉంచింది. నవలలతో పాటుగా అది తెలంగాణయానాన్ని కళ్ళకుకట్టింది. తెలంగాణ ప్రాంత చారిత్రక, రాజకీయ, సామాజిక పరిణామాలకు ప్రతిబింబంగా రూపొందిన ఈ ఆత్మకథ సీరియల్‌గా వస్తున్న రోజుల్లో ఎంతటి ఉత్కంఠతని రేకెత్తించిందో, సాహిత్యరంగం మీద అంతటి ముద్రవేసింది. అన్న పెద్ద దాశరథి కవితల అగ్నిధారలను కురిపిస్తే, రంగాచార్య వచనం మీదనే ఎక్కువగా దృష్టిపెట్టారు. తెలంగాణ గ్రామీణ వాస్తవికతను మాత్రమే కాదు, 1950లు, 60లలో హైదరాబాద్-సికింద్రాబాద్ జీవనశైలిని కూడా ఆయన కథల్లో, నవలల్లో చిత్రీకరించారు.

ఆయుధంపట్టి పోరాటం చేయడం, కలంపట్టి ఆ కాలాన్ని ఆవిష్కరించడం ఒక ఎత్తయితే, మరణించే వరకూ మార్క్సిస్టునే అని ఒకప్పుడు అన్న ఆయన అనంతర కాలంలో

అంతే ప్రభావవంతంగా ఆధ్యాత్మిక రచనలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. రామాయణ భారతాలను మార్క్సిస్టు దృక్కోణంతో చూడడానికి బదులు సరళంగా తెనిగించారు. తెలుగు సాహిత్యచరిత్రలో అనూహ్యమూ, అద్వితీయమూ అయిన మరొక పని తెలుగులోకి వేదాలను అనువదించడం. ఇరవైశతాబ్దాలపాటు జరగని ఆ పని మీద ఎన్నో విమర్శలు వచ్చినా ఎంతో నిష్ఠగా, వివాదాలకు తావులేకుండా పుస్తకరూపం ఇవ్వడానికి ఆయన పడిన శ్రమ అనితరసాధ్యమైనది. వేదం లిపిబద్ధం కారాదనీ, అపౌరుషేయాలను అక్షరీకరించకూడదన్న వాదనలు అటుంచి అనుకున్నదానిని పట్టుదలగా విజయవంతంగా పూర్తిచేయడం ఆయనకు మాత్రమే సాధ్యం. ఆయన మాటలాగానే, రచనలు కూడా ఉంటాయి. నాన్చుడు, సాగదీత కనిపించవు. ముక్కుసూటిగా, కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆయన నైజం. అదే ఆయనను అనంతరకాలంలో అధికార కేంద్రాలకు దూరం చేసివుండవచ్చు. ప్రాంతీయ అస్తిత్వ చైతన్యాన్ని రగిలించడానికి మలిదశ తెలంగాణ ఉద్యమంలో కృషిచేసి పెద్దదిక్కుగా నిలిచిన రంగాచార్య, తరువాత కాలంలో విమర్శనాత్మకంగా వ్యవహరించారు. ఉద్యమగమనంపైనే ఆయనకు అనేక ప్రశ్నలుండేవి. తెలంగాణ సాహిత్యరంగం ఒకతాటి మీద నిలవడానికి ఆయన ఒక స్ఫూర్తిగా నిలిచినప్పటికీ, తనను అంతవరకు మాత్రమే పరిమితం చేసుకోవడానికి ఆయన విముఖత చూపారు.

ఉద్యోగ విరమణ తరువాత సంప్రదాయ శ్రీవైష్ణవ ఆహార్యంలోకి మారిన రంగాచార్య, తన రూపురేఖలకు, అభ్యుదయ భావాలకు మధ్య వైరుధ్యం లేదన్నట్టు వ్యవహరించేవారు. ఆడవారికి షష్టిపూర్తి నిర్వహించడం సంప్రదాయబద్ధం కానప్పటికీ, తన భార్యకు కూడా షష్టిపూర్తి జరిపారు. ఆయా సంప్రదాయ సందర్భాలలోనే దళిత బహుజన వర్గాలకు చెందిన రచయితలను సన్మానించేవారు. ఆయన నివాసంలో జరిగే ఆ కార్యక్రమాలు ప్రత్యేకంగా, ఆసక్తికరంగా ఉండేవి. అభ్యుదయ సాహిత్యోద్యమం ముఖ్యుడిగా రంగాచార్యకు సాహిత్య ప్రయోజనం మీద ఉన్న నిబద్ధత, కడవరకు కొనసాగింది. తెలంగాణ ప్రాంతంలో పురోగామి సాహిత్యానికి తప్పనిసరిగా ఉండితీరవలసిన భూస్వామ్య వ్యతిరేకత అన్న లక్షణం పుష్కలంగా కలిగిన రచనలు రంగాచార్యవి. ఆయన జీవితం సార్థకమైనది

**- ఆంధ్రజ్యోతి**

**9 జూన్, 2015**

# అభినవ వ్యాసుడు

**దా**శరథి రంగాచార్య జీవన ప్రస్థానం సామాజిక చైతన్యానికి దర్పణం.. ఈ చైతన్యం ఈ దేశపు జాతీయతా భూమికపై అంకురించిన తెలుగు తేజం, సాహితీ మాతృదేవి చరణ మంజీర నాదం, స్వేచ్ఛాసమానత్వం కోసం సంఘర్షణ సాగించిన సామాన్యుని సమరనినాదం, సనాతన సంస్కృతికి సరికొత్త సుప్రభాత గీతం...దాశరథి రంగాచార్య తన అగ్రజుడైన కృష్ణమాచార్యుల వలెనే అక్షరస్ఫూర్తి, అక్షరశిల్పి, అక్షరయోధుడు, అక్షరజ్వాల, అక్షరశాసనుడు. దాశరథీ సోదర ద్వయం ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో చెరగని స్మృతుల సమాహారం, జాతీయతా విప్లవ యజ్ఞం...కృష్ణమాచార్యులు పద్యం ద్వారా, రంగాచార్యులు గద్యం ద్వారా తెలుగు భారతికి భరతమాతకు వరాల బిడ్డలయ్యారు. తిమిరంతో ఘన సమరం జరిపిన బతుకే అమరం అన్న కృష్ణమాచార్యులు సంఘర్షణ స్వభావాన్ని ఆవిష్కరించి వెళ్లాడు.. ఈ సంఘర్షణ పథంలో అమృతంగమయ అని అంటూ అజరామర లక్ష్యం వైపు రంగాచార్య భారతీయ సమాజాన్నందించాడు. గద్యం కవీనాం నికషం వదన్తి.. అన్న సనాతన సాహిత్య సంప్రదాయపు గీటురాయిపై రంగాచార్య రచనలు నిగ్గు తేలాయి. రమ్యరస రత్నరాసులై తెలుగుగడ్డపై సభలు తీరాయి. భారతీయతా ప్రభలను పంచిపెడుతున్నాయి. రంగాచార్య భౌతికంగా అస్తమించాడు. ఆంధ్ర సారస్వత ప్రపంచంలో, తెలుగు వాఙ్మయ గగన సీమలలో అతని అక్షరాకృతులకు, చైతన్య కృతులకు అస్తమయం లేదు, ఉండదు. అతడు సామాన్యుని కథ చెప్పాడు. మహాత్ముని కథ చెప్పాడు. సమకాలీనుని కథ చెప్పాడు, కాలానికి కట్టుబడని శాశ్వతుడైన సనాతనుని కథ చెప్పాడు. కలం పట్టిన యోధుడు సాధించదగిన లక్ష్యాలు ఆయనకు సాధ్యమయ్యాయి. ఆయన చరితార్థుడు..ఆయన రచన అతిచిన్న వయసులో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆయన సాగించిన సమర భూమికపై అంకురించింది. సగటు మానవుని సమస్యల సీమలో మారాకు వేసింది. భారత జాతీయతా వనంలో పుష్పించింది. సాంస్కృతిక పరిమళాలను పంచిపెట్టింది. ఇలా ఆయన సాహితీ జీవన స్రోతస్విని సనాతన భావాలను పండించింది. ఈ స్రోతస్విని ఏవిధమైన సంచి పరిధిలోనూ ఇమడనిది.. అతని ముద్ర చెరగనిది.

తెలంగాణలో మాత్రమే కాదు మొత్తం భారతదేశంలో దాస్యాంధకారం అలముకున్న సమయంలో తళుక్కుమన్న స్వాతంత్ర్య భావకాంతి కిరణం దాశరథి రంగాచార్య. క్రీస్తుశకం 1928లో వరంగల్లు జిల్లా చిన్న గూడూరులో ఆయన జన్మించే నాటికి నిజాం నిరంకుశ

పైశాచిక పద ఘట్టనల కింద తెలంగాణ నలిగిపోతుండేది. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతుండేది. రజాకార్ల ఇస్లాం మతోన్మాద బీభత్సం, నిజాం పెత్తందారునికి తాబేదార్లయిన స్థానిక దొరల దౌర్జన్యం తెలంగాణ ప్రజలను ప్రాణావశిష్టులుగా మార్చింది. 1323లో కాకతీయ సామ్రాజ్యం పతనం కావడంతో మొదలైన విదేశీయ జిహాదీల పాలన 1948 వరకు సాగింది. 1948లో తెలంగాణ గడ్డపై మళ్లీ స్వరాజ్య సూర్యుడు ౹దయించే నాటికి రంగాచార్య ఇరవైఏళ్ల యువకుడు. కానీ పదహారవ ఏటనుంచే రంగాచార్య విదేశీయ వారసత్వమైన నిజాం పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. అతిచిన్న వయసులోనే విదేశీయ దమనకాండకు గురై జైలు పాలయిన స్వాతంత్ర్య సమరయోధుడు రంగాచార్య. ఈ స్వాతంత్ర్య సమర నేపథ్యం ఆ తరువాత ఆయన రచించిన సుప్రసిద్ధ నవల చిల్లర దేవుళ్లు నకు ఇతివృత్తం. నిజాం నియంతృత్వానికి బలైన తెలంగాణ ప్రజల విషాదం ఈ నవలలోని జీవనచిత్రం. అనేక ఇతర భాషలలోకి అనువాదమైన ఈ నవల రంగాచార్య స్వాతంత్ర్య నిష్ఠకు ప్రతిరూపం. నిజాం దురంతాల నాటి తెలంగాణ ప్రజల కడగండ్లకు మరో అక్షర జ్వాలా రూపం మోదుగుపూలు. వనవాసీ జన జీవన చైతన్యాగ్ని కణాలు. ఎర్రని వహ్నిశిఖలు మోదుగుపూలు దాశరథి అక్షర శరాలు విదేశీయ భావదాస్యంపై దూకిన జాతీయ విప్లవ యజ్ఞ శిఖల సరాలు..అతడు జ్వలించిన భారతీయత! ఈ భారతీయత అనాది జాతీయత! జాతీయత పథాన్ని మరింత రాజ్యల పరచిన తెలుగు ప్రభా మండలం దాశరథి అక్షరం...

బ్రహ్మ ముహూర్తంలో దాశరథి నిద్ర లేచాడు. మంచు దుప్పటి కప్పుకున్న ప్రకృతి చలికి చల్లబడి కునికిపాట్లు పడుతున్న తెల్లవారుజామున దాశరథి మేల్కొన్నాడు! హేమంత ఋతువు..మార్గశిర పుష్యమాసాలు సంధించుకున్న ధనుస్సంక్రమణ వేళ..రంగాచార్య తన ఇంటిలో లేచి కూర్చున్నాడు. ఆయన స్వయంగా చెప్పుకున్నట్టు బయట మంచు కురిసింది. లోపల హృదయసీమలో అమ్మవారి కరుణ కురిసింది. శ్రీరంగనాథునికి మనసిచ్చి మనువాడిన గోదాదేవి దివ్య ప్రబంధం తిరుప్పావైని రంగాచార్య అలా మంచుకాలంలో తెనింగించాడు. అమ్మవారు, విష్ణుచిత్తుని తనయగా పెరిగిన జగన్మాత, జగన్మంగళ మంచు కాలంలోనే నందవ్రజంలోని గోపాలుని కథను పాడింది. ఆ అమ్మ తన చేత తెలుగు తిరుప్పావై వ్రాయించిందన్నది దశరథి చెప్పిన మాట. సనాతన భావ పరంపరా వర్షంలో తడిసినవాడు రంగాచార్య. కృష్ణ ద్వైపాయన వ్యాసుడు వేదాలను కలియుగం వారికోసం వర్గీకరించాడు. దాశరథి రంగాచార్య తెలుగువారికోసం వేదాలను అనువదించాడు. వ్యాసుని పథాన్ని అనుసరించాడు. ఈ పథం వాల్మీకి నడచిన బాట, వసిష్ఠుడు నడచిన బాట, ఆది శంకరాచార్యుడు నడచిన బాట..రామానుజాచార్యుడు నడిచిన బాట. ఇది ఆద్యంత

రహితమైన సనాతన పథం...వేద మార్గం, భారతీయ జీవనమార్గం. రంగాచార్య అభినవ వ్యాసుడు, తెలుగువారి కృష్ణ ద్వైపాయనుడు. నాలుగు వేదాలను ఆరు సంపుటాలుగా వెలువరించడం రంగాచార్య జీవన యజ్ఞానికి పూర్ణాహుతి సదృశం..వేద వ్యాసుడు రచించిన మహా భారతాన్ని హరివంశంతో సహా ఆంధ్రీకరించడం రంగాచార్య జీవనంలో ప్రస్ఫుటించిన జాతీయ సాంస్కృతిక నిష్ఠకు మరో నిదర్శనం..వేదాలను వర్గీకరించి మహాభారత ఇతిహాసాన్ని రచించిన వ్యాసుడు భాగవత రచన చేసినట్టే రంగాచార్య తిరుప్పావై పాశురాలను తెలుగులో చెప్పి కారణ జన్ముడనిపించుకున్నాడు. తెలుగువారి గుండెలనుండి అతడు కదలడు.

భారతీయతకు, భారతీయతను బలిగొంటున్న విదేశీయ భావజాలానికి మధ్య జరుగుతున్న సంఘర్షణ రంగాచార్య రచనా విన్యాసాలకు రంగభూమి అయింది. ఒకటి కాదు, అనేక నవలలో ఆయన భారతీయుని హృదయ ఘోషను వినిపించాడు. భారతీయతపై దాడి చేస్తున్న వాణిజ్య ప్రపంచీకరణను పలు వ్యాసాలలో నిరసించాడు. నిరోధించాలని ప్రబోధించాడు. 1962లో జరిగిన చైనా వారి భౌతిక దురాక్రమణను అక్షరాయుధాలతో దునుమాడిన రంగాచార్య, విదేశీయుల ఆర్థిక దురాక్రమణ మన జీవన సంస్కృతిని వికృతం చేస్తున్నదన్న ఆవేదనను ఆవిష్కరించాడు. పాశ్చాత్య భావ అంధకార ప్రభావానికి గురి కావడం మృత్యువు వంటిదని, భారతీయతను వెలిగించడమే అమరత్వానికి, అమృతత్వానికి మార్గమని రంగాచార్య ధ్వనింపజేశాడు.. మృత్యోర్మా అమృతంగమయ అన్నది ఆయన మనకు నిరంతరం ఇస్తున్న అక్షర సందేశం. ఆయన దేహం మరుగైపోయింది. సందేశం మారుమోగుతూనే ఉంటుంది.

**- ఆంధ్రభూమి**
**9 జూన్, 2015**

# మోదుగుపువ్వు రాలింది

**రా**నున్నది ఏది నిజం.. సోషలిజమేనని ఘంటాపథంగా చెప్పిన అభినవగోర్కీ దాశరథి రంగాచార్య. పోరాటాలు, ఉద్యమాల నుంచే వెలుగు వస్తుందని చాటారు. సాహిత్యంతో ఉద్యమాలు పుట్టవు. ఉద్యమాల నుంచే సాహిత్యం ఉద్భవిస్తుందని

ప్రబోధించారు. తన రచనలకు పోరాటాలే ఆదర్శం, మార్గదర్శకమని వెల్లడించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి.. తన అక్షరాయుధాలతో శాశ్వతత్వం తెచ్చారు. తెలంగాణ పలుకుబడికి తన సిరాచుక్కతో సరికొత్త సొబగులద్దారు. అసమానతలు, అణచివేతలకు నిలయమైన అలనాటి తెలంగాణ జనజీవన చిత్రాన్ని పోరాట చిత్రంగా మలిచారు. మార్క్సిస్టుగా పోరుబాట నడిచినా.. వచన వేదాన్ని రచించినా.. ఆయన శ్వాస, ధ్యాసంతా మానవశ్రేయస్సు, సమసమాజ ఆవిష్కరణ గురించే సాగింది. మానవహక్కులకు పాతరేసిన నైజాం రక్కస పాలనతో గడీలలో దొరల ఆగడాలను చూసిన ఆయన పసిహృదయం ఎరుపెక్కింది. ఆంధ్రమహాసభ, ఆర్య సమాజాల ప్రభావం, అన్న కృష్ణమాచార్య ప్రేరణతో విద్యార్థిదశలోనే తిరుగుబాటు బావుటా ఎగురేశారు. కుటుంబం కన్నా ఈ సమాజ విముక్తే ముఖ్యమని విశ్వసించి అడుగడుగునా సాహసాలు, అంతరంగంలో త్యాగాలు పొదుపుకున్న ఆయన సాయుధపోరాటంలో క్రియాశీలపాత్ర పోషించారు. తన కుటుంబంపై రజాకార్లు దాడులుచేసినా, పోరాటంలో తుపాకీ తూటా తగిలి గాయపడినా వెనకడుగువేయాని ధీరుడాయన. రాజకీయంగా రావినారాయణ రెడ్డి, రచనలో వట్టికోట ఆళ్వారుస్వామిలను ఆదర్శంగా చేసుకొని ప్రజోద్యమాలతో జీవితాన్ని మమేకం చేసిన అక్షరతపస్వి ఆయన.

ఆయుధాలు వదిలిన చేతితో అక్షరసేద్యం చేపట్టిన ఆయన తెలంగాణ సామాజిక స్వరూపాన్ని క్రమబద్ధంగా నవలీకరించిన ఏకైక రచయిత ఆయన. తెలంగాణ సాయుధపోరాటం ముందుకాలం నాటి పరిస్థితులను 'చిల్లరదేవుళ్లు' నవలుగా అక్షరీకరించారు. సాయుధ పోరాటకాలం నాటి పరిస్థితులను 'మోదుగుపూలు'గా చిత్రించారు. విప్లవానికి ప్రతీకగా మోదుగుపూలు పేరు పెట్టారు. అనంతర స్థితిగతులను 'జనపదం'గా మలిచి తెలంగాణ సమాజ చరిత్రకు దర్పణం పట్టారు. సామాజిక చరిత్రను సృజనాత్మకంగా చెప్పడంలో ఆయన అందెవేసిన చేయి. సంస్కరణతత్వం, చారిత్రక దృష్టి, యథార్థచిత్రణ, మానవతావాదం ఆయన రచనల అంతస్సారం. అన్ని ప్రక్రియల్లోనూ ఉత్తమోత్తమ రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఆ తర్వాత ఆయన భారతీయ తాత్వికతపై దృష్టిపెట్టి నాలుగు వేదాలతో పాటు రామాయణం, మహాభారతం గ్రంథాలను సరళభాషలో వెలువరించారు. ఉద్యమం నుంచి వేదం వరకు తన జీవన ప్రస్థానాన్ని 'జీవనయానం'గా వెలువరించారు. తాను ఏనాడూ అవార్డుల కోసం రాయలేదని జనం కోసమే కలాన్ని నడిపించానని సగర్వంగా చెప్పుకొన్నారాయన. తన పంథా మారిందనే వారికి.. తాను ఇప్పటికీ మార్క్సిజాన్ని విశ్వసిస్తా, దానికి కట్టుబడి ఉంటా.. భారతీయ తాత్వికత కూడా మార్క్సిజం మాదిరిగానే మానవుడి సంక్షేమాన్ని, సమసమాజాన్ని

కోరుతుందని, ఇక్కడ ఆత్మకు సంబంధించిదంటే జీవితానికి చెందినదేనని, ఈ రెండింటి మధ్య వైరుధ్యం లేదని ఆయన సమాధానమిచ్చేవారు. తన జీవితంలో బాగా ప్రభావితం చేసింది రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా పోరాటం, తనను బాగా చలింపచేసినది రష్యాలో సోషలిజం అని చివరి వరకు చెప్పుకున్నారు. అభ్యుదయ రచయితల సంఘం పునర్ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. జీవితంలో ఎన్నో మలుపులు, మైలురాళ్ళు ఎదుర్కొన్న రంగాచార్య తుదిశ్వాస వరకు మానవత ఆదర్శం రెండు కళ్ళుగా సమసమాజ ఆవిష్కరణ, సమున్నత మానవుడ్ని దర్శించడమే తన ఆశ, ఆశయంగా జీవించారు. ఆ సామ్యవాద స్వాప్నికునికి, అక్షరవాచస్పతికి 'మన తెలంగాణ' అందిస్తున్న అక్షర నివాళిది.

**- మన తెలంగాణ**

**9 జూన్, 2015**

# అరుదైన కలం

**అ**సమానతలు, అణచివేత ఉన్నచోటే చైతన్యమూ, పోరాటమూ ఉంటుంది. ధిక్కారం దావానలంలా నలుదిక్కులా వ్యాపిస్తుంది. అందులో బుద్ధిజీవులైన వారు భాగస్వాములు కాకుండా ఉండలేరు. అలా నిజాం నిరంకుశత్వంపై, దొరల దోపిడీ పీడనలపై జనంతో కలిసి పోరాడిన కవులు, రచయితలు తెలంగాణ గడ్డపై ఎంతోమంది ఉన్నారు. 87 ఏళ్ల వయసులో సోమవారం కన్నుమూసిన దాశరథి రంగాచార్య ఆ కోవకు చెందిన విఖ్యాత రచయిత. నిప్పును కడిగే సనాతనుల వంశంలో పుట్టినా పద్దెనిమిదేళ్ల చిరుప్రాయంలోనే తుపాకి పట్టి అజ్ఞాతవాసానికి వెళ్లి మట్టి మనుషులతో భుజం భుజం కలిపి నడిచిన యోధుడు రంగాచార్య. మృత్యువు వెంట్రుకవాసి దూరంలో నిరంతరం వెన్నాడుతూనే ఉన్నా వెరవని వ్యక్తిత్వం ఆయనది. ఆరో తరగతి చదువుతున్న సమయంలోనే నిజాం ఫర్మానాకు వ్యతిరేకంగా ఖమ్మం స్కూల్‌లో విద్యార్థుల్ని సమీకరించి ఉద్యమించడం మొదలుకొని ఆయనది మొదటి నుంచీ పోరాట పథమే. అన్న, అభ్యుదయ కవి దశరథి కృష్ణమాచార్య ప్రేరణతో కమ్యూనిజాన్ని చదువుకొని, పోరాటాన్ని ఒంటబట్టించుకుని సమాజాన్ని చాలా సన్నిహితంగా చూసిన అనుభవంతో రచయితగా ఎదిగాడు. అదపా

దడపా కవిత్వమూ రాశాడు. అయితే, నిజాం రాజరికంపై 'అగ్నిధార' కురిపించిన అన్న కృష్ణమాచార్యే కవిత్వం రాయడానికి సరైనవారని భావించి తాను వచనానికి పరిమితం కావాలని ఆయన నిర్ణయించుకున్నాన.

పాలకుల దాష్టీకాన్ని ప్రశ్నించని వాడు రచయత కాదు గదా... మనిషి కూడా కాదన్న స్పృహతో తెలంగాణ జనజీవితాన్ని అక్షరాల్లో పొదిగినవాడు దాశరథి. నిజాం పాలనను ఇవాళ్టి అవసరాలతో ఎవరైనా అలవోకగా పొగిడేయవచ్చు గానీ.. ఆ భూస్వామ్య పాలన తెలంగాణ జనజీవితాన్ని ఎలా విచ్ఛిన్నం చేసిందో, ఎంతగా కష్టపెట్టిందో, ఎన్ని కుటుంబాల ఉసురుపో సుకున్నదో ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని అక్షరీకరించిన రచయిత ఆయన. నిజాం కాలంలో తెలంగాణ సమాజం ఎట్లా ఉన్నదో.. పోరాటం రాజుకుని విజృంభించిన వేళ అది ఏ ఏ మలుపులు తీసుకున్నదో.. వివిధ సందర్భాల్లో సామాన్యులు చేసిన సాహసాలెలాంటివో... పరిమళించిన మానవీయ విలువల ఔన్నత్యమెంతటిదో కళ్లకు కట్టిన రచనలు ఆయనవి. దాశరథే చెప్పుకున్నట్టు అవన్నీ పోరాటాల కథలు. త్యాగాల కథలు. జీవితం కథలు. తాను పేరు కోసమో, డబ్బు కోసమో రాయలేదని.. ఈ గడ్డన ఎలాంటి మనుషులు మనుగడ సాగించారో, ఎన్ని ఇబ్బందులు పడ్డారో, వాటిని అధిగమించడానికి ఏంచేశారో భవిష్యత్తరాలు తెలుసుకోవడానికే కలం పట్టానని ఆయన చెప్పారు. లేనట్టయితే ఆనాటి నిరంకుశ పాలననూ, రజాకార్ల హింసనూ మరిచి నిజాంను ఒక ప్రభువుగా కీర్తించే ప్రమాదమున్నదని ఆయన శంకించారు.

పోరాట క్షేత్రంలో మాత్రమే కాదు... జీవితంలోనూ ఆయనకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. నమ్మిన విలువల నుంచి వైదొలగకుండానే వీటన్నింటినీ ఆయన ఎదుర్కొన్నారు. పోలీసు చర్య అనంతరం 1948లో సాయుధ పోరాట విరమణ జరిగాక బయటికొచ్చినప్పుడు దాశరథికి జీవితమే ప్రశ్నార్థకమైంది. ఏం చేయాలో, ఎలా బతకాలో తెలియని పరిస్థితి. అన్న జైలుపాలై తనతోపాటు మరో అయిదుగురు కుటుంబసభ్యుల భారం మీదపడినప్పుడు తొణక్కుండా పంటి బిగువున కష్టాలు భరించి మెట్రిక్యులేషన్ పూర్తిచేసి బడిపంతులు ఉద్యోగాన్ని సంపాదించారు. ఆ ఉద్యోగం చేస్తూనే బీఏ ఉత్తీర్ణత సాధించి సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొలువు సంపాదించారు. వట్టికోట ఆళ్వారుస్వామి అసంపూర్తిగా వదిలివెళ్లిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి తాను రచనారంగంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉన్నదని ఆయన గుర్తించారు. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాట పూర్వ పరిస్థితులనూ, ఆ పోరాటం సమయంలో ఉన్న స్థితిగతులనూ, అనంతర పరిణామాలనూ ఆయన రచనలు రికార్డు చేశాయి. ఈ రచనలన్నీ

ఉద్దేశిత వర్గాలకు చేరడానికి అనుసరించాల్సిన మార్గమేమిటో ఆయన ముందే నిర్ణయించుకున్నారు. పాత్రలు సంభాషించుకునే సందర్భంలో మాత్రమే మాండలికానికి చోటీయాలని, మిగిలినదంతా ప్రామాణిక భాషలో సాగాలని భావించారు. అందువల్లే ఆయన కథలైనా, నవలలైనా తెలుగు నేలంతా గుబాళించాయి. తన నవలల్లో చిత్రీకరించే కాలానికి పాఠకుల్ని తీసుకెళ్లడం కోసం దానికి అనుగుణమైన వాతావరణాన్ని ఎన్నుకోవడం, పాత్రలు ఉపయోగించే భాష మొదలుకొని అన్నిటిలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఆయన విశిష్టత. 1938కి పూర్వం నాటి తెలంగాణ జీవితాన్ని చిత్రించిన 'చిల్లరదేవుళ్లు' నవలలో ఉర్దూ పదాలు ఎక్కువగా కనిపించడానికి కారణం ఇదే. దొరతనంపై ఊరు ఊరంతా ఏకమై పోరాడటం ఇతివృత్తంగా సాగిన ఈ నవల హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదమై దేశంలోనే విశేషాదరణ పొందింది. ఈ నవలకు 1970లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. రేడియో నాటకంగా ప్రసారమై, అనంతరకాలంలో చలనచిత్రంగా వచ్చి అందరి మన్ననలూ పొందింది. 'మోదుగుపూలు' నవల సాయుధ పోరాట కాలంనాటి పరిస్థితులనూ 'జనపదం' పోరాట విరమణానంతర పరిణామాలనూ సమర్థవంతంగా కళ్లకు కట్టాయి.

కమ్యూనిస్టుగా జీవితాన్ని ప్రారంభించి, ఆ భావజాలంతోనే కొనసాగుతున్నానని చెప్పిన దాశరథి రామాయణ, మహాభారతాలనూ.. వేదాలనూ, ఉపనిషత్తులనూ, బ్రాహ్మణాలనూ అనువదించడం చాలామందికి వింతగానే అనిపించింది. విశ్వశ్రేయస్సును కాంక్షించడంలో వేదాలూ, కమ్యూనిజం ఒకటేనని ఆయన విశ్వాసం. దేవుణ్ణి నమ్మొచ్చుగానీ, మతతత్వం కూడదంటారు. అది సమాజాన్ని నాశనం చేసేంత ప్రమాదకరమైనదని ఆయన భావన. సమాజంలోని అసమానతలు పోవాలని, పెత్తందారీ పోకడలను ఎదిరించాలనీ, విద్వేషాలను రెచ్చగొట్టేవారు అంతరించిపోవాలనీ ఆకాంక్షించి.. మనుషులు ఒకరి కోసం ఒకరు బతకాలనీ కోరుకుని.. అందుకోసమే రచనలు చేసిన దాశరథి వంటివారు మన సమాజానికి ఎంతో అవసరం. ప్రపంచీకరణ మానవ సంబంధాలను ధ్వంసం చేస్తున్న తీరుపై ఆవేదనా.. ఈ స్థితిపై సమిష్టిగా గొంతెత్తరేమన్న అసహనమూ దాశరథిలో ఉండేవి. ఇలాగైతే భవిష్యత్తరాలు క్షమించబోవని హెచ్చరించేవారు. డబ్బుతో కొనుక్కుంటున్న విద్యవల్ల జ్ఞానం అడుగంటుతున్నదని బాధపడేవారు. తనచుట్టూ ఉన్న సమాజం కోసం, దాని క్షేమం కోసం పరితపించిన మహోన్నతుడు దాశరథి ఆయనకివే మా నివాళులు.

**- సాక్షి**

**10 జూన్, 2015**

# తెలుగు ప్రజల గోర్కీ

**అ**తడొక పరిపూర్ణ మానవుడు. నిండు మనసుతో మిత్రులను పలుకరించే మమతామూర్తి. స్వచ్ఛమైన హృదయంతో నిర్మలంగా చిరునవ్వులు ప్రసరించే అనురాగ స్వరూపుడు. గుండెలో మార్క్సిజాన్ని నింపుకొని, గొంతులో వేదాలను ధ్వనించిన కొత్త పాతల మేలు కలయిక. అతడే డా॥ దాశరథి రంగాచార్య.

తెలంగాణ జీనజీవనం, నిజాం పాలనపై ప్రజలు జరిపిన వీరోచిత పోరాటం, భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు ప్రకటించిన రైతుల ప్రతిఘటన చైతన్యం, మట్టి మనుషుల నుంచి రూపొందిన మహానాయకుల ఆవిర్భావం వంటి అనేకానేక అంశాలను నవలలుగా మలిచిన తెలుగు ప్రజల గోర్కీ డా॥ దాశరథి రంగాచార్య.

హైదరాబాద్ సంస్థానమనే జనారణ్యంలో గంధపు మొక్కలాంటి గ్రామం గూడూరు. వరంగల్ జిల్లాలోని కుగ్రామమది. అక్కడొక పండిత కుటుంబం, వారి తాతతండ్రుల వద్ద దాదాపు ఐదు వేల కుటుంబాలు విద్య నేర్చుకున్నాయి. అప్పుడా కుటుంబం పెద్ద విద్వాన్ వేంకటాచార్యులు. గొప్ప పండితుడు. ఆయన సతీమణి వెంకటమ్మ. తెలుగులో పంచకావ్యాలూ చదివిన విదుషీమణి. వారి తొలి సంతానం దాశరథి కృష్ణమాచార్య. మలిసంతానం దాశరథి రంగాచార్య. తరువాత ముగ్గురు ఆడపిల్లలు.

వారి వంశంలో ప్రతితరంలోనూ ఒక్కడే మగపిల్లాడట. అయితే ఈ దంపతులకు ఇద్దరు మగపిల్లలు పుట్టారు. ఈ ఇద్దర్లో ఒక్కడే బతుకుతాడని తల్లిదండ్రుల విశ్వాసం. అలా బతికేదేదో పెద్దవాడే బతుకుతాడనీ, అతడ్ని బాగా చదివించి ప్రభుత్వ ఉన్నతాధికారిగా తయారుచేయాలని కుటుంబ పెద్దల ఆకాంక్ష. రెండోవాడు మొండికేసి బతికినా నాలుగక్షరాలు నేర్చుకొని పౌరోహిత్యం చేసుకుంటూ కాలక్షేపం చేస్తాడని వారి అంచనా.

అయితే, చుట్టూ నెలకొన్ని సామాజిక నేపథ్యం, నిరంకుశ నిజాం రాజరిక పరిపాలన, వెట్టిచాకిరీ స్వేచ్ఛారాహిత్యం భూస్వామ్య పీడన, పెల్లుబుకుతున్న ప్రజల

ప్రతిఘటన పోరాటాలు ఈ సోదరులిద్దర్నీ ప్రశాంతంగా ఉండనివ్వలేదు. చదువుపై ధ్యాస కుదరలేదు. పౌరోహిత్యనికి పరిమితం కానివ్వలేదు. ఫలితంగా దాశరథి సోదరలిద్దరు తెలంగాణ విమోచనోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అరణ్య, అజ్ఞాత వాసాలు అనుభవించారు. జైలు శిక్షలు భరించారు. పెద్ద దాశరథి ఉద్యమకవిగా అగ్నిధారలు కురిపించాడు. రుద్రవీణలు పలికించాడు. చిన్న దాశరథి నవలా రచయితగా రాటుదేలాడు.

దాశరథి రంగాచార్య రచించిన నవలలన్నీ చరిత్ర నిర్మాతలు ప్రజలన్న సత్యాన్ని వెల్లడిస్తాయి. జనం భాషలో గుండెలు కదలిస్తూ మెదళ్ళను పదును బెడ్తాయి. వీరి నవలలు ఇతర భారతీయ భాషల్లోకి, ఆంగ్లంలోకి అశ్రీనువదింపబడినాయి. 'చిల్లరదేవుళ్ళు' నవల చలనచిత్రంగా రూపొందింది. భూస్వామ్య వ్యవస్థకు ప్రతీకలుగా నిలిచిన చిల్లర దేవుళ్లు : దాశరథి రంగాచార్య రచించిన గొప్పనవల చిల్లరదేవుళ్ళు. తెలంగాణ మాండలిక భాషలో వెలువడిన తొలి నవల ఇది. 1938కి పూర్వం నాటి తెలంగాణ గ్రామీణ జీవితాన్ని చిత్రించిన ఈ నవల 1969లో ప్రచురింపబడింది. 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదమైంది. ఆకాశవాణిలో ధారావాహికంగా ప్రసారమవడంతో పాటు చలనచిత్రంగానూ రూపొందిద్దుకుంది. అనేక విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథంగా సిఫారసు చేయబడిన ఈ నవలపై ఎంఫిల్, పిహెచ్.డి పరిశోధనలు జరిగాయి. నిజాం రాజ్యంలోని ఒక తెలంగాణ పల్లె. ఆ పల్లెలో ఒక గడీ-కోట-భిల్లా. ఆ గడీ ఒక లంక గ్రామం గడీమగ్రి. దాని కింద దేనినీ మొలవనీయదు. ఆ గడీకే గ్రామానికి దొర రామారెడ్డి ఊరంతా ఆ దొర దయాధర్మాల మీద బతకాల్సిందే. పెడితే తినాలి. కొడితే పడాలి. అతడు దొర-ప్రభువు. అతనిదే శాసనం, అతడు మరే శాసనానికి లొంగడు. తాను నిరంకుశుణ్ణని అతనికీ తెలుసు. దాంతో ఒళ్ళంతా గర్వం. దొర దుర్మార్గాలకు వంతపాడే గ్రామ కరణం రామచంద్రరావు, మాలీపటేల్ నిజాముద్దీన్, కోమటి కిష్టయ్య, రైతు నారయ్య, వీరి ఆరాచకాలు, లంబాడి లక్ష్మిపై పోలీసు అమీను అఘాయిత్య ప్రయత్నం, లక్ష్మి తిరుగుబాటు ఫలితంగా ఆమెను అమీను కాల్చి చంపడం, లంబాడీపైనే నేరారోపణ, జైలుశిక్ష మొదలైన అమానుష కృత్యాలకు అంతే లేని సామాజిక వ్యవస్థ. దొర తోటలో చింతకాయలు దొంగిలించాడన్న కారణంగా చాకలి పీరిగాణ్ణి చంపేదాకా వదలని రామారెడ్డి దురహంకారం, కరణం జీతగాడు వీరుడు భార్య పుల్లితో కరణానికి అక్రమ సంబంధం, ఫలితంగా వీరిగాని హత్య వంటి ఎన్నో దారుణాలకు కేంద్ర బిందువులుగా ఉన్న చిల్లర దేవుళ్ళ నగ్న స్వరూపాన్ని ఎత్తిచూపిన నవల ఇది.

**- డా॥ ఎస్వీ సత్యనారాయణ**

**అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు**

# దాశరథి సృజనలో
# తెలంగాణ గుండె చప్పుడు

గత యాభై ఏళ్ళలో తెలుగులో విస్తృతంగా రాస్తున్న వారిలో దాశరథి రంగాచార్య ఒకరు. 1960 ప్రాంతంలో రచనా జీవితం ప్రారంభించి, నిరంతరాయంగా రచనలు చేస్తున్నారు. మొదట్లో 'చిల్లరదేవుళ్ళు' వంటి ప్రగతిశీల నవలలు రచించిన రంగాచార్య రామాయణ భారత భాగవతాదులను వచనంలో రచించడమే కాక వేదాల వచనానువాదానికి కూడా పూనుకొని కృతకృత్యుడయ్యారు. తరువాత ఉపనిషత్తులను కూడా అనువదించారు. సామాన్యంగా సాంప్రదాయం నుంచి కమ్యూనిజం వైపుకు మళ్ళినవారు కనిపిస్తారు. కాని దానికి విరుద్ధంగా కమ్యూనిజం నుంచి సాంప్రదాయం వైపునకు మళ్ళి రంగాచార్య అందర్నీ ఆశ్చర్యపరిచారు.

ఒక రచయిత రచనలను విశ్లేషించాలంటే, అతని కుటుంబం, పరిసరాలు, జీవన విధానం ముందుగా అధ్యయనం చేయాలని ఇ.హెచ్.కార్ అంటారు. ఆ కోణంలోంచి చూస్తే, ఆయన బాల్యం అతి సంప్రదాయ వాతావరణంలో నడిచింది. తండ్రి నిరాదరణతో కుటుంబం పేద జీవితాన్ని గడపాల్సివచ్చింది. సంప్రదాయ విద్యను అభ్యసించిన రంగాచార్య మొదట్లో ఆర్యసమాజం, తరువాత ఆధునిక భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆ రోజుల్లో నైజాంకు వ్యతిరేకంగా పని చేస్తున్న ఆంధ్ర మహాసభ కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఊరూరు తిరిగి రైతులను సభ్యులుగా చేర్పించారు. ఈ క్రమంలో రంగాచార్యకు మార్క్సిస్టు సాహిత్యం చేరువైంది. ప్రపంచ రాజకీయ జ్ఞానం అలవడింది. ఆర్థిక, చారిత్రక నేపథ్యంతో సమాజాన్ని పరిశీలించే గుణం అలవడింది. గార్లలో గ్రంథాలయం, బాలసంఘం ఏర్పాటుచేశారు. ఆ కాలంలో ఆయన విపరీతంగా పుస్తకాలు చదివారు. నాటి రాజకీయ పరిస్థితులు, పఠనం రంగాచార్యను

నికార్సయిన కమ్యూనిస్టు యోధునిగా, మార్క్సిస్టు జ్ఞానం కలిగిన రచయితగా రూపు దిద్దుకునేందుకు దోహదపడ్డాయి.

నిజాం వ్యతిరేక పోరాటం సాయుధపోరాటంగా మారిన తర్వాత రంగాచార్య కూడా తుపాకి పట్టి పోరాటంలో పాల్గొనేలా చేశాయి ఆనాటి ఉద్యమ పరిస్థితులు. పోలీసు చర్య తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాత రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆయన పార్టీకి దూరమయ్యారు. సొంతంగా చదువుకుని, ప్రైవేటుగా పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించుకున్నారు. దాంతో జీవితంలో కొంత స్థిరత్వం ఏర్పడింది.

## దాశరథి సాహిత్యం

దాశరథి రాసిన తొమ్మిది నవలల్లో 'చిల్లరదేవుళ్ళు' మొదటిది. 1938కి పూర్వపు తెలంగాణ ప్రజా జీవితాన్ని కథావస్తువుగా తీసుకుని ఈ నవల రాశారు. ఇందులో కొందరు వ్యక్తుల జీవితాలు కాక, ఆనాటి సమాజానికి ప్రతిబింబమైన సంపూర్ణ గ్రామీణ జీవితాన్ని కథావస్తువుగా స్వీకరించారు. గ్రామానికి రెడ్డి, కరణం, రైతు, కోమటి, చాకలి, మంగలి, మాలమాదిగలు సప్తాంగాల వంటివారు. వారితో నాటి గ్రామవ్యవస్థ తీరుతెన్నులు ప్రదర్శిస్తూనే అమానుషమైన దాడులు, అధికారుల దోపిడి, దుర్మార్గాలు, వెట్టి, బేగరి లాంటి కట్టుబాట్లు, ఆడబాపల దుర్భర జీవితాలను వర్ణించారు. నవల అంతా బాగానే వుంది కాని ఇందులోని కథానాయకుడు ఆంధ్రా నుంచి వచ్చిన సారంగపాణి చిన్నతనంలో బెజవాడ పుణ్యస్నానాలలో తప్పిపోయిన రామారెడ్డి మేనల్లుడిగా క్లైమాక్స్‌లో తేల్చివేయడం సినిమాటిక్‌గా వుంది. రచయిత సినిమా కోసం చేసిన ప్రయత్నంగా కొంతమంది విమర్శించినా, తర్వాత కాలంలో ఇది లో బడ్జెట్ చిత్రంగా రూపొందింది. తెలంగాణ బతుకును ఉద్ధరించడానికి, ఆంధ్రా వ్యక్తే పూనుకోవడం పట్ల కొంతమంది ఆక్షేపణలు వెలిబుచ్చారు.

## మాయజలతారు

ఈ నవల 1969 నాటికి వున్న హైదరాబాద్ నగర సమస్యని చిత్రిస్తుంది. విలువలు పడిపోయి, వ్యాపార సంస్కృతి పెరిగిన నగరంలో ధనికుల జల్సాలు,

దుర్వ్యసనాలు, దోపిడి, కూటికి గతిలేని పేదల బతుకు చిత్రం, మోసగాళ్ళకు బలవుతున్న అమాయకుల జీవితాలను వర్ణిస్తుంది. భూసమస్యతోపాటు నగరంలో జరిగే మోసాలు, సంఘ విద్రోహ కార్యక్రమాలు, అధికారులు, దళారులు, కాంట్రాక్టర్ల మోసాలు, తమ అభివృద్ధి కోసం ఆడవారిని పావులుగా వాడుకోవడం, నగరంలో పేదవారికి, ధనికుల జీవితాలకు మధ్య తేడాను తెలుపుతూ ఈ 'మాయజలతారు' నవల రాశారు. నగరాల్లో పెద్ద హోటళ్ళు అసాంఘిక కార్యకలాపాలకు ఎలా నెలవుగా మారతాయో దీనిలో చూడొచ్చు. వీటితోపాటు మహంకాళి ఉత్సవాలు, బోనాలు, రంగం, జముకుల కథ, సినీరంగ విశేషాలు, ఉర్దూ కవిత్వం – ఇలా నగర సాంస్కృతిక వాతావరణాన్ని ఈ నవల చక్కగా ప్రతిబింబించింది.

## మోదుగుపూలు

చిల్లరదేవుళ్ళు నవలలో 1938కి పూర్వపు తెలంగాణ ప్రజా జీవితం చిత్రించబడితే, 'మోదుగుపూలు'లో 1938 నుంచి 1948 వరకు, అంటే హైదరాబాద్ సంస్థానంపై పోలీస్ చర్య జరిగే దాకా తెలంగాణ ప్రజా జీవితం, పోరాటానికి ప్రజలు సిద్ధమైన తీరు చిత్రించబడింది. ఈ నవల నిజాం సంస్థానానికి ఒక జాగీర్ వేదికగా రచింపబడింది. నవల ప్రారంభంలోనే జాగీర్ల పుట్టుపూర్వోత్తరాలు, దాని పాలనా విధానం వివరంగా చెప్పారు రచయిత. జాగిర్దార్ ఎక్కడో పట్నంలో జల్సాలు చేస్తుంటే, తాసిల్దారు తానే ప్రభువును అయినట్టు ఎలా అధికారం చెలాయించారో నవల వర్ణిస్తుంది. తాసిల్దార్, గిర్దావర్, అమీన్, సాహుకారులు నాటి సమాజంలో ప్రజలను ఎలా పీడించారో ఇందులో చూడొచ్చు. నవలలో పీర్లపండగ వృత్తాంతం, తెలంగాణలో అది జరుపుకునే తీరు, ఆ శోకదినాలలో తాసిల్దార్ దాతృత్వంతోపాటు కోయల జీవనవిధానం గురించి కూడా వర్ణించారు. పోరాట నవలగా పేరుపొందిన 'మోదుగుపూలు' నవలలో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల పాత్ర గురించి లేకపోవడం ఆశ్చర్యం.

## జనపదం

1948లో పోలీస్ చర్య తర్వాతి నుంచి, అసంతృప్తితో రగిలిపోయిన యువత మరో సాయుధపోరాటానికి సిద్ధమైన 1968 వరకు మధ్య కాలాన్ని చిత్రించింది. జనపదం

ఇతివృత్తం చాలా విశాలమైంది. 1948 తర్వాత తెలంగాణ ప్రజల్లో వచ్చినమార్పు, మారిన గ్రామ స్వరూపాలు, స్వాతంత్ర్యం తరువాత కూడా మారని బడుగుల జీవితాలు, దొరల దోపిడీ, కలుషితమైన రాజకీయాలు, ఎన్నికల ప్రహసనాలు, తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్న వీరులు నిస్సహాయలుగా మారడం, ఆ నిస్సహాయత లోంచి కొత్తతరం ఆవిర్భవించడాన్ని నవలలో చిత్రించారు. రంగాచార్య మిగతా నవలల్లాగే ఇందులోనూ భూసమస్య ప్రధానంగానే కనిపిస్తుంది.

## రానున్నది ఏది నిజం?

తెలంగాణ జనజీవితాన్ని, పోరాటాన్ని నవలలో చిత్రించిన రంగాచార్య తాను ఏమి ఆశిస్తున్నారో, ఆ ఆశించే సమాజం ఎలా వుంటుందో 'రానున్నది ఏదినిజం' నవలలో చిత్రించారు. సమసమాజాన్ని ప్రతిపాదించే సామ్యవాదం భారతదేశంలో వస్తే రాజకీయ, ఆర్థిక, సాంఘిక మార్పులు ఎలా వుంటాయో రచయిత ఈ నవలలో చిత్రించారు.

## పావని

స్వాతంత్ర్యం వచ్చిన ముప్పయ్యేళ్ళ తర్వాత కూడా, స్వరాజ్య కాంతులు ప్రసరించని గ్రామాలు, అభివృద్ధి జాడ అందని గ్రామాలు, మధ్యయుగాల నాటి భూస్వామ్య వ్యవస్థకు చిహ్నమైన పాలన, వెట్టిచాకిరికి నిలయంగా మారిన గ్రామాల దుస్థితిని, ప్రజల వెతలు, అమానుషమైన అంటరానితనాన్ని 'పావని' నవలలో చిత్రీకరించారు.

## మానవత

డబ్బుపరంగానే కాకుండా మత ఛాందసవాదులు మానవతను మతం ముసుగులో ఎలా బంధిస్తారు, అలాంటివారిలో సైతం ప్రాణం మీదకు వచ్చినప్పుడు మతాలను పక్కనపెట్టి మానవత ఎలా పెల్లుబుకుతుందో ఈ నవలలో చిత్రించారు రచయిత. అంతిమ విజయం 'మానవత'దే అన్న సత్యాన్ని ఇందులో నిరూపించారు.

## శరతల్పం

ఈ నవలలోని గ్రామం, సనాతన సంప్రదాయ బద్ధంగా జీవనం సాగిస్తున్న గ్రామాలకు ప్రతీక. సంప్రదాయ జీవనంలో అంటరానితనం, మానవ సంబంధాలు, ఆర్థికసమస్యలు, కుల కట్టుబాట్లు ఎలా వుంటాయో చెబుతూ నాటి గ్రామ స్వరూపాన్ని సమగ్రంగా చిత్రించారు. అయితే ఆ సమాజం ఏ స్థితిలో వుందో చెబుతూనే ఎలా వుండాలో కూడా చెప్పి సమాజానికి కనువిప్పు కలిగిస్తారు.

## అమృతం గమయ

ఒక గ్రామస్థాపన మొదలు దాని క్రమవికాసం, పారిశ్రామికీకరణ, పాశ్చాత్యీకరణ, సమాజంలో తెచ్చిన మార్పులు, పడిపోతున్న మానవ విలువలను కళ్ళకు గట్టినట్లు 'అమృతంగమయ' నవల చిత్రీకరించింది. ఆధ్యాత్మిక రచనలు, నవలలు, జీవితచరిత్ర రాసిన తర్వాత రాసిన నవల ఇది. సహజంగానే పూర్వపు రచనల ప్రభావం ఈ నవలలో కనిపిస్తుంది. నవల ప్రధాన ఉద్దేశం వేద గ్రామ స్థాపన. అందుకు తగినట్లుగానే యథోచితంగా వేదాలు, ఉపనిషత్తులు, ఇతర గ్రంథాల ఉల్లేఖనలు దీనిలో కనిపిస్తాయి.

దాశరథి రంగాచార్య నవలాకారునిగా పేరొందినప్పటికీ కథకునిగా, కవిగా, అనువాదకునిగా పేరొందారు. వేదాలు అనువాదం చేశారు. అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు రచించారు. ఆయన రాసిన 21 కథలని కలిపి 'నల్లనాగు' శీర్షికన కథల పుస్తకం వెలువరించారు. దీనిలో సమాజంలోని వైవిధ్య పార్శ్వాల్ని చిత్రించిన కథలున్నాయి. సమాజ పోకడల్లోని వైపరీత్యం చిత్రితమైంది.

అనువాదకునిగా ఆయన చేసిన సేవ విశేషమైనది. నిజానికి రంగాచార్య సాహిత్య ప్రస్థానం అనువాదాలతోనే ప్రారంభమయింది. బహుభాషా పాండిత్యం, అధ్యయనశీలురు కావడం వల్ల వారి అనువాదాలు కూడా స్వతంత్ర రచనలుగా భాసిల్లాయి. బెంగాల్ కరువు ఇతివృత్తంగా రాప్టర్ భవాన్ భట్టాచార్య రాసిన ఆంగ్ల నవలను 'దేవుని

'పేరిట' పేరుతో అనువదించారు. నిజాం కొలువులో ఉర్దూ అనువాదకునిగా పని చేసిన మీర్జా రుస్వా రచించిన ఉర్దూ నవల 'ఉమ్రావ్ జాన్ అదా'ను రంగాచార్య తెలుగులోకి అనువదించారు. ఈ నవల 1857కు ముందు లక్నో నవాబుల విలాస జీవిత వృత్తాంతాన్ని చిత్రీకరించింది.

జిలానీ బాను ప్రముఖ ఉర్దూ రచయిత్రి. కథలలో అణచివేతకు గురయిన స్త్రీల బలాలు, బలహీనతలు, వాటి చుట్టూ ఆవరించి వున్న ఒంటరితనాన్ని చిత్రించారామె. తద్వారా పాఠకుల మనసుల మీద చెరగని ముద్ర వేశారు. ఆమె రాసిన కథల్లోంచి 24 కథలను 'కేదారం' పేరిట రంగాచార్య అనువదించారు. అలాగే రంగాచార్య చేసిన అనువాదాల్లో ఇక్బాల్ కవితల అనువాదం ప్రసిద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ఎంపిక చేసిన ఇరవై తెలుగు కథలను 'తెలుగు అఫ్సానే' పేరిట ఉర్దూలోకి అనువాదం చేశారు. ఈవిధంగా వారి అనువాద ప్రతిభ అనన్యమైంది.

అలాగే కవిగా ప్రజాసమస్యల పట్ల స్పందించి ఆటవెలది రూపంలో శతకం రాశారు. నూటొక్క పద్యాలు 'జనరంగా' శీర్షికన వెలువడ్డాయి. అలాగే 2002లో వెలువరించిన 'మానస కవిత'లో 163 మినీ కవితలున్నాయి.

**పిల్లల కోసం...**

బాలసాహిత్యం కూడా అందించారు రంగాచార్య. బాల సాహిత్యంలో వారి తొలిరచన వివేకానందుని గురించి. ఆయన సంక్షిప్త జీవితచరిత్ర 1960లో వెలువడింది. మహాత్ముని సంక్షిప్త జీవితచరిత్రను కూడా 1963లో రాశారు. మహాకవి కాళిదాసు రచించిన మూడు నాటకాలు - శకుంతల, మాళవిక–అగ్నిమిత్రుడు (1962), విక్రముడు–ఊర్వశి (1963) పిల్లల కోసం రాశారు. మడిపడగ బలరామాచార్యులు బొమ్మలు వేశారు. శ్రీ వేంకటేశ్వర లీలలు (1976)లో రాశారు. సందర్భానుసారంగా సంస్కృత శ్లోకాల్ని, వాటి వివరాల్ని ఇవ్వడం విశేషం.

## సంప్రదాయ సాహిత్యం

శ్రీమద్రామాయణము, శ్రీమద్భాగవతము, సీతాచరితం, భారతసూపం, శ్రీమహాభారతం, తిరుప్పావై రచనల్ని సులభ వచనశైలిలో అందించారు. ఈ గ్రంథాలకు 'ఆలోచనామృతము' శీర్షికన రాసిన వ్యాఖ్య విమర్శనా దృష్టిని సంతరించుకుంది.

## వేదసాహిత్యం

రంగాచార్య చిన్ననాటి నుంచి వేదాలపై పెంచుకున్న అనురక్తి, తర్వాత కొనసాగించిన అధ్యయనం, కొందరు వేదవ్యాఖ్యాతల వక్రభాష్యాలు ఆయనను వేదరచనకు ఉపక్రమించేలా చేశాయి. కనుక తెలుగులో నాలుగు వేదాలను వచనరూపంలో అందించారు. ఆ తర్వాత 'ఉపనిషత్తులు' కూడా తేటతెలుగులో వచనంలో అందించడం విశేషం. 'ఆలోచనామృతం శీర్షికన సుదీర్ఘమైన వ్యాఖ్యలు రాశారు.

## ఆత్మకథ 'జీవనయానం'

చినగూడూరులో పుట్టి, భాగ్యనగరంతో పెనవేసుకుపోయిన జీవితాన్ని ప్రతిఫలించింది దాశరథి 'జీవనయానం'. ఇందులో రంగాచార్య జీవితమే కాదు, ఏడు దశాబ్దాల తెలుగుజాతి జీవనచిత్రణ కనిపిస్తుంది. ఇక 'యాత్రాజీవనం' రంగాచార్య అనుభవాలు, అనుభూతులకు అక్షరరూపం. దేశమంతా తిరిగి చేసిన తీర్థయాత్రలు, వాటి విశ్లేషణ ఇందులో కనిపిస్తుంది. ఒక అంశానికి సంబంధించిన పూర్వాపరాల్ని, నిర్దిష్టమైన సమాచారంతో కథలు, ఉపకథలతో చెప్పడం విశేషం.

దాశరథి రంగాచార్య వ్యాసాలు, ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు కలిపి 'అక్షర మందాకిని', 'శబ్దశ్వాస' పేరుతో వెలువడ్డాయి. అలాగే 'ప్రేమ్‌చంద్ జీవితం–సాహిత్యం' అనే మరో పుస్తకం రాశారాయన. లేఖాప్రక్రియను కూడా నిర్వహించారు. సమాజంలోని అన్యాయాలని, సామాన్యుల కష్టాలని చూసి స్పందిస్తూ 'దేహదాసు ఉత్తరాలు' పేరిట రాసిన లేఖలన్నీ ప్రభుత్వ పెద్దలకు రాసినవే. సరళ గ్రాంథికంలో వున్నాయి. ఈ లేఖలు నాటి సమకాలీన సాంఘిక జీవనానికి అద్దం పడతాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే రంగాచార్య సాహిత్య జీవితం విస్తృతమైంది. జనజీవితాల్ని నవలలుగా మలిచారు. ఆధ్యాత్మిక గ్రంథాల్ని సరళమైన వచనంలో రచించారు. తెలంగాణకు చెందిన వాస్తవ జీవితాన్ని నవలల్లో, కథల్లో అందించారు. 'జీవనయానం' ద్వారా తను చూసిన, అనుభవించిన, అనుభవపరిధిలోకి వచ్చిన జీవితాన్ని దర్శింపజేశారు. ఆధ్యాత్మిక గ్రంథాల సారాన్ని తనదైన ప్రత్యేకమైన శైలితో సృజించారు. చిన్న చిన్న వాక్యాలతో పూసగుచ్చినట్టు చెప్పే ఆయన రచనారీతిలో ప్రత్యేక ఆకర్షణ వుంది. కనుకనే దాశరథి రంగాచార్య రచనలకు ప్రత్యేక పాఠకవర్గం ఏర్పడింది. దాదాపు అరవై సంవత్సరాల పాటు విస్తారంగా రచనలు చేసి పాఠకుల చైతన్యపరిధి విస్తృతం కావడానికి తోడ్పడ్డారు. విభిన్న ప్రక్రియల్లో యాభై పుస్తకాలకు పైగా వెలువరించిన దాశరథి రంగాచార్య సాహిత్యకృషి తెలుగు పాఠకుల సృజనాత్మక అభిరుచిని ఇనుమడింపజేసింది.

**- కె.పి.అశోక్ కుమార్**

# విలక్షణ అక్షరయానం

ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన దివంగత దాశరథి రంగాచార్య అక్షరయానంలో ఎన్నెన్నో మైలురాళ్ళున్నాయి. ఆయన సంస్కృతాంధ్ర ఊర్దూ భాషల్లో చక్కని పండితులు. గొప్ప వచన రచయిత. నాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్న యోధుడు. తాను నమ్మిన విలువల పట్ల సడలని పట్టుదలతో బ్రతికిన వ్యక్తి. ఆధునిక తెలుగు సాహిత్యంలో వైవిధ్యభరిత రచనలు చేసిన ప్రతిభామూర్తుల కోవలో దాశరథి రంగాచార్యకు ప్రత్యేకమైన చోటు తప్పకుండా ఉంటుంది. రంగాచార్య కాలధర్మం చెందడంతో నాటి నిజాం సంస్థాన కాలపు ప్రసిద్ధ రచయితల తరం దాదాపుగా కనుమరుగైనట్టు లెక్క.

మహాకవి దాశరథి (కృష్ణమాచార్యులు) కవితా రచనలో మేరునగ శిఖరంగా ఎదిగినట్టుగానే ఆయన సోదరుడు రంగాచార్య నవలా సృజనలో ఉన్నత స్థాయిని అందుకున్నారు. రంగాచార్య నవలలు రమారమి ఆరు దశాబ్దాల తెలంగాణ సమాజాన్ని అత్యంత వాస్తవిక రీతిలో చిత్రించాయి. తొలి తెలంగాణ నవలా రచయిత వట్టికోట ఆళ్వార్‌స్వామి ఈ దిశలో తనకు స్ఫూర్తినిచ్చినట్టు రంగాచార్య స్వయంగా చెప్పుకున్నారు. ఆళ్వార్ స్వామి 1930వ దశాబ్దం నాటి తెలంగాణ సమాజాన్ని చిత్రిస్తూ "ప్రజల మనిషి" నవలను రచించారు. అనంతరం ఆరంభించిన "గంగు" నవల ఆయన మరణంతో అర్థాంతరంగానే ముగిసింది. అటు తరువాత ఎవరూ ఆనాటి తెలంగాణను నవలల్లో చిత్రించేందుకు యత్నించలేదు. ఈ నిజాన్ని దృష్టిలో పెట్టుకొని రంగాచార్య "చిల్లర దేవుళ్ళు" నవలను రచించారు. ఇది ఆనాడు ఒక సంచలనం! తెలంగాణాలో బాగా వాడుకలో ఉన్న ఉర్దూ మాటల్ని, స్థానీయమైన పలుకుబడుల్ని కూడా నవలలో ఎంతో చక్కగా ఉపయోగించుకున్నారు రంగాచార్య. తెలంగాణ పలుకుబడులకు

సాహిత్యంలో పెద్దగా ప్రచారం దక్కని 1970వ దశాబ్ది ఆరంభంలో ఇదొక పెద్ద సాహసం. చైతన్యంపు అరుణ కిరణాలు ఇంకా ఉద్భవించని అప్పటి తెలంగాణ గ్రామీణ సమాజంలో భూస్వాములు, గ్రామాధికారుల పెత్తనం ఎట్లా ఉండేదో "చిల్లర దేవుళ్ళు" చిత్రించింది. తెలుగు నవలా వికాసాన్ని గురించి విశ్లేషించే క్రమంలో "చిల్లర దేవుళ్ళు" ప్రస్తావన తప్ప కుండా వస్తుంది. రంగాచార్యకు బాగా ఇష్టమైన నవల "మోదుగు పూలు" ఈ సంగతిని ఆయనే ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. పలువురు సాహితీ విమర్శకులు "మోదుగు పూలు"లో రంగాచార్య సాధించిన "శిల్ప ప్రజ్ఞ"ను ప్రశంసించారు. ఎక్కడా ఎటువంటి అనవసరమైన పాత్రలు సంభాషణలు లేకుండా చక్కగా ఈ నవలను తీర్చిదిద్దారు రంగాచార్య. 1940ల నాటి తెలంగాణ పరిస్థితులు మోదుగుపూలు నవలలో కనబడతాయి. రంగాచార్య నవలల్లో విస్తారమైది. "జనపదం" ఇది రెండు భాగాలుగా ఉంది. 1950వ దశాబ్ది ఆరంభం నుండి పాతిక సంవత్సరాల పాటు తెలంగాణ గ్రామీణ, పట్టణ సమాజాల్లో చోటుచేసుకున్న రాజకీయ, సామాజిక పరిణామాల్ని జనపదం ఆవిష్కరించింది. రంగాచార్య లేఖిని నుండి వెలువడిన "శరతల్పం". "మాయ జలతారు" కూడా విశిష్టమైన నవలలే. తెలంగాణ ప్రాంతపు సామాన్య ప్రజానీకం వాడుకలో ఉన్న పలుకుబడుల్ని తన నవలలన్నింటిలోనూ ప్రయోగించారు. దాశరథి రంగాచార్య. ఈ విధంగా ఆయన తెలంగాణ ప్రాంత వర్ధమాన రచయితలకు స్ఫూర్తి మూర్తిగా మారారు.

రంగాచార్య వచనం అమృతం వంటిది! ఒక వైపు ఆహ్లాదంగా చదివిస్తూనే మరో దిశలో ఆలోచనల్ని రేకెత్తించగలిగే "రసన" ఆయన వచనంలో ఉంటుంది. రచన అంతటా ఒక ఆత్మీయమైన స్పర్శపరుచుకొని మనల్ని పలకరిస్తుంది. ఇందుకు నిలువెత్తు ఉదాహరణ "జీవనయానం". రంగాచార్య ఆత్మకథ ఇది. వందల పుటలతో కొనసాగిన జీవనయానాన్ని సామాన్య పాఠకులు సైతం ఇష్టపడుతూ చదవగలరు. ఒకవైపు గత కాలపు జ్ఞాపకాలు, మరో వైపు వర్తమాన వాస్తవికతల మేళవింపుతో సాగిపోతుంది ఇది. కొన్నిసార్లు "ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు" అంటూ గతంలోని మంచివైపు పాఠకుడిని తీసుకొని పోతారు రంగాచార్య. ఆనాటి అనురాగాలు, అప్పటి స్వచ్ఛమైన మానవ సంబంధాలు మనల్ని కదిలిస్తాయి. పదహారేళ్ళ ప్రాయంలోనే రంగాచార్య తన జీవితంతో సంఘర్షించిన పరిస్థితులు ఆయన పసివయసులోనే పోరాట పటిమ ఆరంభమైనట్టు చెబుతాయి. తెలుగు సాహిత్యంలోని ఉత్తమ స్థాయి ఆత్మకథల్లో "జీవనయానం" ఒకటి.

రంగాచార్య తన జీవన సంధ్యాసమయంలో రచించిన వాటిలో వేదాల వ్యాఖ్యానం ఒకటి. ఆనాడు యాస్కుడు, సాయణుడు వంటి వేదాంతులు చేసిన పనిని ఆధునిక యుగంలో రంగాచార్య చేసి చూపించారు. వేద సంబంధమైన అంశాల్లో లోతైన పాండిత్యం ఉన్నందువల్లనే రంగాచార్య అనువాదాలు ప్రసిద్ధిని పొందాయి. యువతరం సైతం ఈ అనువాద సంపుటాల్ని భద్రంగా పదిలపరుచుకుంది.

వాల్మీకి రామాయణాన్ని ఎంతో గొప్పగా రంగాచార్య అనువదించారు. ఈ రచన కూడా రంగాచార్య వచన రచనా ప్రతిభకు దర్పణం పడుతోంది.

1950ల నుండి తెలంగాణ పరిస్థితులన్నింటినీ రంగాచార్య నిశితంగా గమనిస్తూ వచ్చారు. నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నప్పటికీ అనంతర కాలంలో ఏనాడూ రాజకీయాల పట్ల ఆసక్తిని చూపించలేదు. రాజకీయ రంగంలో వచ్చిన అనూహ్య మార్పులే ఇందుకు కారణమని “జీవనయానం” చెబుతోంది. అభ్యుదయతత్వాన్నీ, భారతీయ సనాతన తత్వాన్నీ ఈ రెంటినీ అభిమానించిన విలక్షణ వ్యక్తి రంగాచార్య.

సమకాలీన సమాజాన్ని, తాను చూపిన పరిస్థితుల్ని పరిపూర్ణ శిల్పదృష్టితో అక్షరబద్ధం చేసిన రంగాచార్య అనేక తరాలపాటు తెలుగు రచయితలకు గొప్ప ఆదర్శంగా నిలుస్తారు.

**- గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి**

# మన కాలపు మహామనీషి

**అ**క్షర వాచస్పతి దాశరథి రంగాచార్య జీవితం భిన్న వైరుధ్యాల నిలయం. ఉత్తర, దక్షిణ ధ్రువాల్లా ఉండే అంశాలు ఆయనలో ఒక్కటిగా కలిసి కాపురం చేస్తాయి. ఆయనను చూస్తే,నిజాం నవాబుకు వ్యతి రేకంగా సాగిన పోరులో తుపాకీ పట్టి పోరాడారనీ, ఆయన నుదిటిపై కనిపించే తిరునామాలు చూసి ఆయనొక మార్క్సిస్టు అని ఎవరూ అనుకోరు. కానీ, ఆయన విప్లవశక్తికి ప్రతీక. ఆయన జీవితమే ఉద్యమం. ఏదీ చేసినా ఉద్యమంగా చేస్తారు. రంగాచార్య మార్క్సిజాన్ని ఎంతగా ప్రేమిస్తారో, సంప్రదాయాన్ని అంతగా ఇష్టపడతారు.

తెలుగు సాహిత్యానికి నిక్కమైన నీలాల్లాంటి నవలలు అందించిన రంగాచార్య, అదే చేత్తో రామాయణ, భారత, భాగవత, వేదాలు, ఉపనిషత్తులు తెలుగు జాతికి అందించారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ దృక్పథానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన దాశరథి రంగాచార్య స్వాతంత్ర్య సమర యోధుడిగా, అక్షర బ్రహ్మగా ప్రజల హృదయాల్లో పీఠం వేసుకున్నారు.

కమ్యూనిస్టు యోధుడు చంద్రరాజేశ్వరరావు చేత ఆంధ్రగోర్కీగా ప్రశంసించబడిన దాశరథి రంగాచార్య 1928 ఆగస్టు 24న వరంగల్ జిల్లాలోని చినగూడూరులో జన్మించారు. కవితా ప్రపంచంలో లబ్ధప్రతిష్టులైన దాశరథి కృష్ణమాచార్య వీరి అగ్రజుడు. రంగాచార్య సనాతన సంప్రదాయ కుటుంబ వాతావరణంలో పెరిగారు. ఇతరుల నీడ పడితే మైల పడిపో తాం అన్నంత ఛాందసం. మడి కట్టుకుంటే సంస్కృత ద్రావిడాలే మాట్లాడాలి. తెలుగు మాట్లాడ కూడదు. స్కూల్లో ఉర్దూ తప్ప తెలుగు ఉండదు. ఇంటా, బయటా తెలుగుపై అంత చిన్నచూపు, నిరాదరణ ఉన్నా, దాశరథి సోదరులు ఇద్దరికి తెలుగు భాషపై ఎనలేని మమకారం. రంగాచార్య వచన రచనను చేపట్టి, కాల్పనిక, సంప్రదాయ సాహిత్య సృష్టిలో అనితరసాధ్యమైన స్థాయికి చేరుకున్నారు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంతది అనే నానుడి రంగాచార్య జీవితంలో నిజమయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వచ్చిన వందేమాతర ఉద్యమం, నిజాం రాజ్యంలోని ఇతర ప్రాంతాలకు పాకిం ది. అప్పుడు రంగాచార్య పాఠశాల ప్రార్థన సమయం లో వందేమాతరం చదివి ఉపాధ్యాయుల చేతిలో దెబ్బలు తిన్నాడు. ఆరోతరగతిలో ఉండగా నిజాం నవాబు విధించిన యూనిఫారంలో కుచ్చుటోపికి బదులు గాంధీ టోపి పెట్టుకుంటామని స్కూ ల్లో విద్యార్థుల చేత సమ్మె చేయించి విజయం సాధించారు. కానీ, పాఠశాల నుంచి బహిష్కరణకు గురయ్యాడు. దాంతో ఆయన చదువు ఆరోతరగతితో ఆగిపోయింది. ఆ కాలంలో అందరిలాగే రంగాచార్యను కూడా వామపక్ష భావజాలం ఆకర్షించింది. గ్రామాల్లో తిరిగిప్రజలను ఆంధ్రమహాసభలో చేర్పించారు.

పిల్లలకు పాఠాలు చెప్పారు. వయోజనులకు రాత్రి పాఠశాలలు నడిపారు. తహశీల్దార్‌ను ఎదిరించి గ్రామంలోకి పత్రిక తెచ్చారు. ఆ కాలంలోనే మార్క్సిస్టు సాహిత్యాన్ని విపరీతంగా చదివారు. తెలంగాణ రైతాంగ పోరాటం సాయుధ రూపు తీసుకుని ఉ ధృతమవడంతో, రంగాచార్య కూడా అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. తుపాకీ పేల్చడంలో శిక్షణ తీసుకున్నా రు. 1948 సెప్టెంబర్ 16న పోలీస్ యాక్ష న్ తర్వాత ూద్యమం నుంచి బయటకు వచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రజలను పీడించిన దొరలే, ఖద్దరు, గాంధీ టోపీ ధరించి రాజకీయ నాయకులుగా అవతారమెత్తారు. రంగాచార్య వారి మధ్య ఇమడలేకపోయారు. స్వయంకృషితో చదువుకుని 1951లో ఉపాధ్యా య వృత్తిలో ప్రవేశించారు. తర్వాత 1957లో సికింద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరారు.

రంగాచార్యకు ఆళ్వార్‌స్వామి బంధువు. పైగా ఇద్దరికీ పోరాట నేపథ్యం, సాహిత్యాభిలాష ఉంది. దాంతో ఇద్దరి మధ్య మంచి బంధం ఏర్పడింది. ఆళ్వార్‌స్వామి వదిలి వెళ్లిన ఉద్యమాన్ని ఎవరూ తలకెత్తుకోలేదు. చివరికి రంగాచార్య తనదైన పద్ధతిలో తెలంగాణా ప్రజల జీవణ చిత్రణ కోసం నవలా రచనకు పూనుకున్నారు. ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నా రు. నవలా రచనకు సంబంధించి పుస్తకాలు అధ్యయనం చేశారు. మొదటి నవల చిల్లర దేవుళ్లు (1969)వెలువరించారు. తెలంగాణ గురించి తెలంగాణ మాండలికంలో రాసిన నవల కావడంతో విశేష ఆదరణ పొందింది. మొదటి నవలకే కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందారు రంగాచార్య.

చిల్లరదేవుళ్లు 1974లో చలనచిత్రంగా వచ్చింది. చిల్లరదేవుళ్లులో 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942–

48 కాలాన్ని మోదుగుపూలు (1971) వర్ణిస్తుంది. రంగాచార్య నిర్వహించిన పోరాట చిత్రణమే మోదుగుపూలు నవల ఇతివృత్తం. ఈ నవలను చది వే, రంగాచార్యను ఆంధ్రగోర్కీగా అభివర్ణించారు చంద్రరాజేశ్వరరావు. స్వాతంత్ర్యం తర్వాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలా న్ని జనపదం (1976)లో చిత్రించారు. నగర సమస్యల ఇతివృత్తంతో మాయాజలతారు (1971) రాశారు. దేశంలో సామ్యవాద స్థాపన జరుగుతుందన్న ఆశలను, ఆశయాలను రానున్నది ఏది నిజం (1971)నవలలో చిత్రించారు. మానవత (1980) నవలలో మతాలు వెలసిపోయే రంగులు, మానవత నిరంతరం నిలిచి ఉండే ఘనత అనే సందేశం ఇస్తారు.

ఒక బ్రాహ్మణునికి, ఒక దళితునికి మధ్య స్నేహాన్ని కల్పించి, మానవత్వం దైవత్వానికి అతి దగ్గరని శరతల్పం (1980) నవలలో నిరూపించారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా ఆ స్వాతంత్ర్యపు వెలుగులు ప్రసరించని గ్రామాలు ఎలా దోపిడీకి గురయ్యాయో, ఆ దోపిడీలో ప్రజల విషాద జీవితా లు, టీచరమ్మ నుంచి చైతన్యం పొంది గ్రామస్తులు తిరగబడి విజయం సాధించడం పావని నవల చిత్రిస్తుంది. 1977లో రాసిన ఈ నవల 2000లో పుస్తకంగా వచ్చింది. వీటి తర్వాత రంగాచార్య దృష్టి సంప్రదాయ సాహిత్యంపై పడింది.

భారతం, వేదాలు, ఉపనిషత్తులు అనువదించిన తర్వాత మళ్లీ నవలా రచనకు ఉపక్రమించారు. ప్రపంచీకరణ, పారిశ్రామీకరణ ప్రభావంతో మరణం వైపు పయనిస్తున్న ప్రజలను అమృతం వైపు పయనింపజేసే అమృతం గమయ(2004) నవలను రాశారు. ఇందులో భారతీయ తాత్త్వికత, దాని గొప్పదనం, ఆంగ్లేయు లు దాన్ని ధ్వంసం చేసిన విధానం, భారత సంప్రదాయాన్ని రక్షించుకోవాల్సిన అవసరం తదితర విషయాలు చిత్రించారు.

రంగాచార్య మొత్తం 9 నవలలు రాశారు. వీటిలో చిల్లరదేవుళ్లు, మోదుగుపూలు, జనపదం నవలలు పిరీయాడిక్ నవలలు కావడంతో ఒక నవల ముగిం పు మరో నవలకు ప్రారంభం అవుతుంది. విషయ నివేదనకు సాధారణ భాషనే వాడినా, పాత్రలు వారివారి సాంఘిక నేపథ్యాన్ని బట్టి మాట్లాడే భాష వేర్వేరుగా ఉంటుంది.

ఇలా ఉండడంవల్ల నవల చాలా సహజంగా సాగుతుంది. సంఘటనలు, సంభాషణలు హృదయానికి హత్తుకుంటాయి. రంగాచార్య అనగానే నవలా రచనే గుర్తొస్తుంది. కానీ నవలల కంటే ముందే, ముప్పై మూడేళ్ల వయసులోనే ఆయన శ్రీమద్రామాయణము

(1962) రచించారు. కాలక్రమంలో వాల్మీకి రామాయణంలో చోటుచేసుకున్న అవాల్మీకాలు లేకుండా అచ్చంగా వాల్మీకి ప్రోక్తమైన రామాయాణాన్ని తెలుగువారికి వచనంలో అందించారు.

రంగాచార్య అంత చిన్నవయస్సులోనే రామాయణాన్ని అధ్యయనం చేసిన తీరును, రాసిన విధానాన్ని విశ్వనాథ సత్యనారాయణ, ఆచార్య దివాకర్ల వేంకటవధాని వంటి ఉ ద్ధండులు కొనియాడారు.రామాయణంలో అక్కడక్కడా రాసిన రంగాచార్య విమర్శనాత్మక అభిప్రాయాలు చదువరులను ఆలోచింపచేస్తాయి. అపరిమితమైన జ్ఞానాన్ని అందిస్తాయి. రామాయణం తర్వాత శ్రీమద్భాగవతం(1969)రాశారు. ఈ రచనలో వ్యాసున్ని అనుసరించినా, పోతన పద్యాల రుచిని పాఠకులకు చూపించారు. సీతాచరితం(1978)పేర మరోసారి రామాయణాన్ని రాశారు. 1994లో హరివంశ సహిత మహాభారతము రచించారు. రామాయణ, భారత, భాగవతాలు రాసిన తర్వాత ఇక భారతీయ సంప్రదాయ సాహిత్యంలో హిమవదున్నతమైన నాలుగు వేదాల ను ఎంతో శ్రమించి తేట తెలుగు వచనంలో అందించారు.

రంగాచార్య ప్రజలకు వేదం అనే నినాదంతో వేద ఉద్యమాన్ని ప్రారంభించి, విజయవంతంగా పూర్తిచేశారు. వేదావిష్కరణోత్సవంలో ఒక స్త్రీకి, ఒక దళిత యువకుడికి వేద ప్రతులు అందించారు. వేదాల తర్వాత ముఖ్యమైన పది ఉపనిషత్తులు, ఋగ్వేద శాంఖాయన బ్రాహ్మణము, ఋగ్వేద ఐతరయ బ్రాహ్మణము, వేదం జీవననాదం పరిచయం, వేదం జీవననాదం ఋగ్వేద పరిచయం, మానస తిరుప్పా వై, తాను దర్శించిన దేశంలోని యాత్రా స్థలాల విశేషాలతో యాత్రా జీవనం రచించారు.

ఆయన రాసినవన్ని ఉద్గ్రంథాలే. అయితే, రంగాచార్య కథ చెప్పి వదిలేయలేదు. సాహిత్యంలో తనకున్న పరిజ్ఞానం, ప్రపంచ జ్ఞానంతో ఆ కథకు సంబంధించి పూర్వాపరాలు, మంచి చెడులు చర్చించారు. ఈ విధానాన్ని శ్రీమద్రామాయణముతో ప్రారంభించారు. తర్వాత కూడా ఈ విధానాన్ని అవలంబించా రు. అయితే తర్వాతి రచనల్లో తన అభిప్రాయాలకు ఆలోచనామృతముఅనే పేరు పెట్టారు. ఆయన వ్యాఖ్య అమృత ప్రాయమైన ఆలోచనలు కలిగిస్తుం ది. పాతను కొత్తతో మేళవించి చూపుతుం ది. భారతీయ తాత్త్వికతను ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తుం ది. ప్రాచీన సాహిత్యమంతా పుక్కిటి పురాణాలు కావ నీ, మానవజాతిని ఉన్నత దిశగా తీసుకొనిపోయే అమృతత్త్వం అందులో ఉందని నిరూపిస్తుంది.

రంగాచార్య జీవితానికి, అనువాదాలకు విడదీయని బంధం ఉంది. ఆయన చిన్నతనంలోనే వారి తండ్రి నిర్వహించిన దాశరథి పత్రికకోసం ద్రావిడ గ్రంథాలు అనువదించారు. తర్వాతి కాలంలో ఆయ న సాహితీ జీవితం అనువాదంతోనే ప్రారంభం అయింది. 1940ల్లో కోల్‌కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల 'He who rides A Tiger' ను దేవుని పేరిటపేరుతో తెలుగులో అనువదించారు. దీనిని వట్టికోట ఆళ్వార్‌స్వామి దేశోద్ధారక గ్రంథమండలి తరఫున ప్రచురించారు.

రంగాచార్య తొలినాళ్లలో పిల్లలకోసం 1960-63 మధ్య వివేకానందుడు, మహాత్ముడు, కాళిదాసు అనే మూడు నాటకాలు రచించారు. 1974లో శ్రీవేంకటేశ్వరలీలలు రచించాడు. ఇక 1962లో భారత్‌పై చైనా దాడిచేసినప్పుడు, తెలుగులో వెలువడిన కవితలను రణభేరి పేర సంకలనం చేశారు. రంగాచార్య రచనల్లో ప్రత్యేకంగా పేర్కొనవలసిన మరొక రచన జీవనయానం. అది రంగాచార్య జీవిత కథ. జీవనయానంలో రంగాచార్య తన జీవితంతోపాటు, ఏడు దశాబ్దాల తెలుగుజాతి జీవితాన్ని చిత్రించారు. జీవనది ప్రవాహంలా సాగే ఆయన రచనలో అంత మహత్తు ఉంటుంది.

**- వి. జయప్రకాష్**

**ఓయూ రీసెర్చ్ స్కాలర్**

# జీవితాన్ని నేర్పింది కమ్యూనిస్టు ఉద్యమం

"నన్ను వ్యక్తులుగా ప్రభావితం చేసిన దానికంటే ఉద్యమాలు ఎక్కువగా ప్రభావితం చేశాయి. నేను ఉద్యమజీవిని. ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమం జీవితాన్ని నేర్పింది. మనిషిని చేసింది. సమాజం ఒకటున్నది. నీ బతుకు సమాజంతో ఉన్నది అని చూపింది. కాబట్టి సమాజం కోసం ఏదన్నా చేయాలి అని నేర్పింది. ఆవిధంగా నేనెక్కువగా ప్రభావితమయింది సమాజ పరిణామాలతో" అంటున్న దాశరథి రంగాచార్య మనోభావాల పరంపర ఇది...

**నైజాం వ్యతిరేక పోరాటరోజుల గురించి...?**

మా అన్నయ్య అదృష్టమేమిటంటే ఈ రజాకార్లు, గొడవలు, గందరగోళాలు జరిగేముందు ఆయన జైలుకు వెళ్ళిపోయినాడు. జైలుకు వెళ్ళిపోయి పద్యాలు రాశాడు. అది సామాన్యమయిన పని కాదు. ఎందుకంటే ఏ రాజ్యంలో వున్నాడో అక్కడే జైలులో కూర్చొని

"ఓ నిజాము పిశాచమా,

కానరాడు నిన్ను బోలిన రాజు మా కెన్నడేని,

తీగలను దెంపి అగ్నిలో దింపినావు,

నా తెలంగాణ కోటి రతనాల వీణ"

ఆ జైలులో ఉండి ఆ నిజామును "ఓ నిజాము పిశాచమా" అనగల ధైర్యం, సాహసం ఎవరికుండాలి? అయితే ఆటుపోట్లన్నీ మా పాలిట పడ్డాయి.

నా కెందుకో జీవితం ఎంత గొప్పది అన్పిస్తుంది, దేవుడు కాదు. అండర్‌గ్రౌండ్ జీవితంలోకి వెళ్ళేప్పుడు, మా అమ్మన్నది ఏమిరా మమ్మల్నొదిలి పోతావా అని. అప్పుడు నేనన్నాను "అమ్మా నువ్వు మా ఐదుగురికి మాత్రమే తల్లివి. కోటి మంది తెలంగాణ నన్ను పిలుస్తున్నది. కానీ ఒక విషయం చెబుతున్నాను. అన్నయ్య జైల్లో భద్రం. నేను పోయ్యేది మృత్యుమార్గం. నేను మళ్లీ తిరిగొస్తానని అనుకోకు. ఏ పద్ధతిలో నయినా నీకో కొడుకు మిగులుతాడు" అని చెప్పి వెళ్ళిపోయా. తల్లి ఎంత ఏడ్చుంటుంది పాపం! ఇద్దరు కొడుకులు వెళ్ళిపోయారు. పసిపిల్లలు ముగ్గురూ ఆడపిల్లలు. వాళ్ళ పోషణ బాధ్యత... మళ్ళీ మా అన్నయ్య తప్పే నేనూ చేశాను.

అది 47 డిసెంబర్. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేసింది. ఒక రాత్రి వచ్చాను. ఎందుకొచ్చావురా అంది అమ్మ. అమ్మా చూడాలనిపించింది అన్నాను. ఇక్కడయినా చచ్చేదే... అక్కడయినా చచ్చేదే. చూసి చద్దామని అని నేనన్నా. పాపం ఆమె ఏడ్చింది. రాత్రి పన్నెండు గంటలకు సర్వర్ అనే జమేదార్ వచ్చాడు 'రంగచార్యులు సాబ్ హై' అంటూ... తప్పించుకోవటం నాకు తెలుసు. కానీ చిక్కకుండా పోతే అమ్మ సంగతి, పిల్లల సంగతి. 'హై' అంటూ వచ్చాను. మా అమ్మ పోరాటాలు చూసింది. పరిణామాలు తెలుసు. రంగడూ మళ్ళీ ఎప్పుడొస్తవురా అన్నది. "అమ్మా, భగవంతుడు చాలా గొప్పవాడు. జీవితరచన ఎట్లాంటిదో తెలియదు మనకు" అన్నా.

ఇట్లా పోతుంటే అరుగు మీద బీడీ పీకుతూ ఒకడు కూర్చున్నాడు. వాడి పేరు పూసాల నారాయణ. వాడు తాగున్నడు. 'రంగాచారి ఎటు బోతున్నావు' అన్నాడు వాడు. 'అబే తూ భీ చల్' అన్నాడు జమేదార్. కార్తీక పౌర్ణమి ఆ రోజు. గూడా సూర్యనారాయణ అనే వాడు పులిహోర తీసుకొస్తున్నాడు, ఇంట్లో మా వాళ్ళకు ఇద్దామని.

"అరె రంగన్న ఎప్పుడొచ్చినవ్? వీడెవడు" అన్నాడు ఆ జమేదార్‌ని చూసి.

"వీడెవడు బోల్తా, జమ్మేదార్ హై బే. తూ భీ చల్" అని వాడ్ని తీసుకున్నాడు.

అమృతరెడ్డి అనే కుర్రవాడు ఇంట్లో పడుకుందామని వస్తున్నాడు. వాడ్ని చూసి 'తూ భీ నికల్ బే" అన్నాడు.

జీవితం ఎలా వుంటుందంటే అక్కడ కాశీం అని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుపాకీ పట్టుకుని నన్ను చంపటానికి కూర్చున్నాడు. వెన్నెల. కార్తీక పౌర్ణమి. వీళ్లందరినీ చూశాక "అబే తేరే గుట్నే మే దిమాఖ్ హైరే" అన్నాడా ఆ జమేదారుని.

"అకేలే కీ లేకే ఆవో బోలేతే, ఇత్నే లోగోంకో కైకూ లాయా... " అంటే ఆ జమేదారు "సాబ్ కమ్యూనిస్టా హైయే సాబ్" అన్నాడు.

ఇక ఆ కాశీం తన చేతిలో కర్ర విరిగే దాకా నన్ను కొట్టాడు. ఆ కర్ర విరిగి వానికి చాతకాక నన్ను వదిలేసి పోయాడు. నేనేడవలేదు. వీళ్ళందర్ని తీసుకుపోయి ఆ కస్టడీలో పారెయ్యి అని వీనికే (సర్వర్ వాడి పేరు) ఇచ్చి పంపించాడు.

అక్కడేమిటి, ఆ కస్టడీలో జాగా లేదు. అందరు మనవాళ్లే. కామ్రేడ్స్. "అరే ఏంరా నువ్వెందుకొచ్చినవు" అని అడగడం మొదలుపెట్టారు. "క్యాబోలో రే సాబ్, సాబ్ కా జాన్ బచ్‌గయా" అంటాడా సర్వర్ (జమేదారు)

మమ్మల్ని తీసుకుపోయి రికార్డుల రూంలో వేశారు. ఏమిటో తెలియని ఉన్మాదం ఆ రోజుల్లో. నిప్పు పెట్టుందా ఎవరి దగ్గరన్న అని అడిగా. ఉన్నదన్నడు అమృతరెడ్డి. తీసిండు. ఎందుకన్నడు. రికార్డులు తగలబెడత అన్నా. ఏదో పని చేయాలి గదా. వాళ్ళు వెంటనే "వద్దు నాయనా పిల్లలు గల వాళ్ళం. నువ్వు అంత పని చేస్తవు. నీకు దణ్ణం పెడతాం. వద్దు వద్దు" అన్నారు. ఏమయితది, పోతే పానమే (ప్రాణమే) కదా అంటాన్నేను. అది ఆశ్చర్యమనిపిస్తుంది.

**తర్వాతి జీవితం...**

నా పెళ్ళి నేను సమ్మె చేయించకముందే అయింది. 39లో పెళ్ళయినప్పుడు కమలకు ఏడేళ్ళు. నాకు పన్నెండేళ్ళు. బాల్య వివాహాలొద్దంటారు. కానీ మేము మాత్రం బావున్నాం. ఈ గార్హ్యస్థ జీవితమొ తపస్సు. అద్వైతమూ సుఖదు:ఖ యోగ: అన్నారు కానీ ఆమె కష్టాల్లో నేనూ, నా కష్టాల్లో ఆమె పాలుపంచుకున్నాం.

మీరింత హాయిగా ఎలా వుంటారు అని ఎవరో అడిగారు కమలని, ఆమె ఒకటే చెప్పింది "నేను చెప్పింది ఆయన వింటారు. ఆయన చెప్పింది నేను వింటాను" అని. నాకు సాధారణంగా కోపాలు, గోపాలు రావటం... రుచులు గుచులు నాకు తెలియవు. ఆవిడ వండిపెట్టింది నేను తింటా. 48 తర్వాత బయటికి వస్తే నైజాం నవాబు మారాడు

తప్ప, మిగిలినవేవీ మారలేదు. కాబట్టి మనం రాజకీయాల్లోకి పోవద్దు అని మా అన్నయ్య, నేను దృఢ నిశ్చయం చేసుకున్నాం. మా అన్నయ్య అదృష్టమేమిటంటే ఆయనప్పటికే మెట్రిక్యులేషన్ పాసయి ఉన్నాడు. నాకు ఏమీ లేదు. అప్పుడు ప్రైమరీ తీసుకొని, గుడ్డిదీపం కింద కూచొని చదివి ఆంధ్రా మెట్రిక్యులేషన్ పరీక్ష ఇచ్చా. ఇస్తే పరీక్ష పాసయ్యా మొత్తానికి. అదీ గొప్ప విషయమే. తర్వాత రెండు ఉద్యోగాలొచ్చినయి. ఒకటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. ఇంకోటి టీచరు. అందరూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం తీసుకో, దరిద్రం ఇన్నాళ్ళు అనుభవించారు ఇంక పోతుంది అన్నారు. నాకేమో గ్రాడ్యుయేట్ కావాలని ఉంది. టీచరయితే కానీ గ్రాడ్యుయేట్ కావటానికి లేదు ఆ రోజుల్లో. అందుకని ప్రైవేటుగా బి.ఏ. ఇచ్చాను. అది 56లో. 57లో మున్సిపల్ కార్పోరేషన్‌లో ట్రాన్స్‌లేటర్ కావాలని ప్రకటన వచ్చింది. ఇక్కడికి (హైదరాబాద్‌కు) వచ్చాను. సెలక్టయి పోయాను. సికింద్రాబాద్ ఇంగ్లీష్, హైద్రాబాద్ ఉర్దూ. 1957 నుంచి ఇక్కడే ఉన్నాను.

**అనువాదాల గురించి...**

అనువాదాలంటే 'ఉమ్రావ్ జాన్ అదా' నవల అనువాదం చేశాను. మీర్జా రుస్వా రచించిన గొప్ప నవల ఇది. "ఏక్ క్షాతిరే చోర్ దిల్ చురాకర్ లే తదూ, పాస్ మే కంభక్ సబ్ సోతే, సోతే". "అంటే చాలా తెలివయిన ఒక చోరుడు గుండె ఎత్తుకుని పోయినాడు, పక్కనే పడుకుని ఉన్నారందరూ ఏం లాభం. మొద్దు వెధవలు" అని. తర్వాత ఇక్బాల్‌వి చాలా అనువాదాలు చేశాను. దంభర్ కే మస్జిద్ ఖడా కర్‌దీ రుమాకీ హరారత్ వారోనే, దిల్ వహీ పురానా పాపీథా. మర్ భర్ మే నమాజీ బన్ సక్' అంటాడు ఇక్బాల్. రాత్రికి రాత్రే దేవాలయం కట్టించినాడు భక్తీ, ఆవేశంతో. కానీ మనసు అదే పాడవుది. జీవితాంతం భక్తుడు కాలేదు.

జిలానీబానో కున్న ప్రావీణ్యం కవిత్వంలో చాలా గొప్పది. గొప్ప మానవత్వం కలిగిన మనిషి. జిలానీ బానో కవిత్వం, కథలు ఎన్నో అనువాదం చేశాను. ఉర్దూలో పొడువాటి వాక్యాలు రాస్తుంది. ఇంకో గొప్పదనం ఆవిడలో ఏమిటంటే వాటిని ఉర్దూ కథలు అంటానికి వీల్లేదు. అవి తెలుగు కథలే. తెలుగు జీవితం చెబుతుందావిడ. హైదరాబాద్ ఆవిడ. సాధికారికంగా చెబుతుంది.

## మీ నవలల గురించి...

నాకు భయమేమిటంటే వచ్చే తరాల వాళ్ళు నిజాము చాలా గొప్పవాడు అంటారేమోనని. ఎందుకంటే. ఉస్మానియా హాస్పిటల్ కట్టాడు, హైకోర్టు బిల్డింగ్ కట్టాడు అనే ఉద్దేశంతో. ముందు 'చిల్లరదేవుళ్లు' రాయటం మొదలు పెట్టాను. 'చిల్లరదేవుళ్లు' చాలా ప్రభావాత్మకమయిన నవల. ఒక కొత్త దృక్పథాన్ని ఏర్పాటు చేసింది. అది విజయవంతమయింది కాబట్టి సరిపోయింది. లేకపోతే మా వాళ్లంతా మట్టిపోసే వాళ్లు.

ఇక 'జనపథం' చాలా విశాలమయిన విస్తృతమయిన నవల. మొత్తం సమాజాన్ని ఒక మైక్రోస్కోపిక్‌గా చూపిన నవల. ఒక వైపు పోలీసు యాక్షన్ అయిపోయి మేము పంచేసిన భూములనన్నింటిని దొరలు కాజేయడంతో మొదలవుతుంది నవల. ఎన్ని ఉద్యమాలొచ్చినయి. ఉద్యమాల పేర ఎంత మోసం జరిగింది, రాజకీయాలు ఎంత భ్రష్టు పడుతున్నాయి అనే విషయాలను చాలా వివరంగా చెప్పే నవల. ఒక్క తెలంగాణ కాదు, మొత్తం భారతదేశానికి చెందిన నవల అది...చరిత్రలోని నిజం చెప్పడమే నా నవల ఉద్దేశం. సత్యాన్ని చెప్పడం జరిగింది, జరిగింది చెప్పడం తప్ప వ్యాఖ్య చేయ్యటం కాదు.

## రచనల గురించి...

మా అన్నయ్య, నేను ఇద్దరం కవిత్వం రాశాం. The more feudal is the society, The more respect to the poetry అంటాడు కార్లే. నేను కావాలని వచన రచయితనయ్యాను. ఎందుకంటే ఒక నవల తప్ప మరేదీ జీవితాన్ని రిప్రజెంట్ చెయ్యలేదు కాబట్టి. మేమిద్దరం అనుకున్నదేమిటంటే నాయన నువ్వు వచనం రాయొద్దు, నేను పోయెట్రీ రాయొద్దు అని. మా అన్నయ్య వచనం రాశాడు. నేను పద్యం రాయలా.

1962లో నేను రామాయణం రాశాను. తెన్నేటి విశ్వనాథం గారు, ఉత్పల సత్యనారాయణ గారు, దీపాల పిచ్చయ్యశాస్త్రి గారి వంటి పెద్దల సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. విశ్వనాథ సత్యనారాయణ గారు సన్మానం చేశాడు. ఆయనకూ, నాకూ

రామాయణం దృక్పథంలో తేడా వుంది. ఆయన రాముడు దేవుడు అంటాడు. నేను రాముడు మనిషి అంటాను. మా ఇద్దరి ఉపన్యాసాలు జరిగిపోయినాయి. "నీ కథ నీకె అంకితము. నీవు నరావళిలోన ఉత్తమ నరుడవై యుగాలయిన నన్ను వసివాడవు జ్ఞాపకాలలో. లోకము నిన్ను దేవుడని లోతుగా చూడదు. నాదు గుండెకున్ తాకెద మానవాగ్రునిగ. దాశరథీ కరుణాపయోనిధి". ఇది నా పద్యం. అప్పుడు విశ్వనాథ సత్యనారాయణ– "దాశరథి రంగాచార్యతో నేను దేనిలోనూ ఏకీభవించను, రాముని కరుణా కటాక్షాలలోనే వాల్మీకి రామాయణం రాశాడని విశ్వసించే వారిలో నేనూ ఒకడిని. వాల్మీకి వల్లనే రాముడు బతికేవాడు అనే వాడు దాశరథి రంగాచార్యులు. అయినా దాశరథి రంగాచార్యులు వలె రామాయణం అధ్యయనం చేయడం అవసరం" అన్నాడు.

## ప్రభావితం చేసిన రచయితలు

నన్ను వ్యక్తులుగా ప్రభావితం చేసిన దానికంటే ఉద్యమాలు ఎక్కువగా ప్రభావితం చేశాయి. నేను ఉద్యమజీవిని. ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమం జీవితాన్ని నేర్పింది. మనిషిని చేసింది. సమాజం ఒకటున్నది. నీ బతుకు సమాజంతో ఉన్నది అని చూపింది. కాబట్టి సమాజం కోసం ఏదన్నా చేయాలి అని నేర్పింది. ఆవిధంగా నేనెక్కువగా ప్రభావితమయింది సమాజ పరిణామాలతో. చూస్తున్న దౌష్ట్యంతో. నన్ను ప్రభావితం చేసిన రచయితల్లో మొదట గోర్కీ. అదేదో యాదృచ్ఛికంగా రామాయణం చదవాల్సి వచ్చింది. వాల్మీకి రామాయణం చదవగానే నా కర్థమయిందేమిటంటే వాల్మీకీకి, గోర్కీకి చాలా సంబంధమున్నదని. అతను జీవితం ఎంత నగ్నంగా కర్కశంగా ఉందో చూపుతాడు. నేను రాశాను – వాల్మీకి రాముడిలో దైవత్వం కనిపించకుండా ఉండటానికి ఎంత ప్రయత్నం చెయ్యాలో అంత ప్రయత్నం చేశాడూ అని. పెళ్లాం పోతే సాధారణ వ్యక్తి ఎలా ఏడ్చాడో అతను అలాగే ఏడ్చాడు. అజ్ఞానిలా ప్రవర్తించాడు. వాల్మీకీని, గోర్కీని ఒక్కసారి అవలోకించినప్పుడు ఈ సమాజం అర్థమయిన వాడూ, మనిషి అర్థమయినవాడూ, జీవితం అర్థమయినవాడూ అందరూ ఒకటేనేమో అని అన్పించింది. నిజంగా నేను వాల్మీకిని ప్రేమించినా, భక్తుణ్ణి అయినా, గోర్కీని వదులుకోలేను. గోర్కీ మీద ఇంప్రూవ్‌మెంట్

వాల్మీకి అనుకుంటాను. నాకు సంబంధించినంతవరకు వాల్మీకికి తెలిసినంతగా మనస్తత్వం గురించి ఇంకెవ్వరికీ తెలీదు.

## మీ రచనల్లో ప్రియమయిన పుస్తకం

'మోదుగుపూలు' సుమారు నా ఆత్మకథ లాంటిది. నేను 'జీవనయానం' రాద్దామని అనుకోలేదు. ఆత్మకథ రాసుకునేంత గొప్పవాడినని ఇవాళ్టికీ అనుకోవటం లేదు. కాబట్టి ఒక నవలారూపంలో రాశాను. ఇంకోటేమిటంటే మీరు ఏ నవలలో అయినా లోపాలు చూపించగలరు. కానీ 'మోదుగుపూలు'లో చూపించలేరు. ఒక పర్‌ఫెక్షన్‌తో సాగుతుంది. "ఉద్యమం ఎక్కడ అహింసాయుతంగా మొదలవుతుందో, ఎక్కడ హింసాత్మకంగా మారుతుందో చెప్పాడు రంగాచార్య గారు. ఇంకొకళ్లకు చాతకాదు" అన్నాడు రాజేశ్వరరావు గారు. ఆంధ్రా గోర్కీ అన్నాడు. అక్కడ (నవలలో) ఒక మాట అన్నాను- 'సిద్ధాంతం కన్నా కర్తవ్యం గొప్పది. నేను ఆయుధం పట్టుకుని పోతాను. నమ్మితే నా వెంటరా! అంటే ఆ పిల్ల అన్నది, నాకు ఒక్కడే భర్త. ఒక్కటే విశ్వాసం. ఛస్తే నేనిట్లాగే ఛస్తా అంటుంది. విశ్వాసం కంటే కర్తవ్యం గొప్పది' అని చెప్పాను. ఈ మాట గాంధీజీ చేసి చూపించారు. 1942లో 'డూ ఆర్ డై' అన్నాడు ఆయన. అది ఆయన సిద్ధాంతం కాదు, కర్తవ్యం. You paste a paper on your breast that you are a satyagrahi. If you are die people may recognise that you are a satyagrahi.

చావు అనే మాట రాకూడదు ఆయన నోటి నుంచి. ఏమిటి అంటే అప్పటి అవసరం అది. అక్కడ కర్తవ్యం ఏమిటి? భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలి. నేను ఉపవాసం చేస్తాను అనేది ముఖ్యం కాదు కదా! జీవితం అనేది ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు కదా! జీవితం కంటే విచిత్రమయినది, విశిష్టమయినది, మళ్లీ రానిది మరొకటి లేదు. మరి దీని గురించి ఆలోచించకుండా వేరే వెధవ విషయాల వెంటపడడం ఎందుకు? అదే కదా వేదం చెబుతున్నది. చెట్లన్నింటినీ కొట్టేస్తే ఎలా బతుకుతాం! ప్లాస్టిక్ చెట్లను పెట్టుకునే స్థాయికి వచ్చేశాం కదా! అందుకోసం మనల్ని గురించి, మన కుటుంబాన్ని గురించి, మన సమాజాన్ని గురించి ఏదయినా బాగు చేద్దామంటే ఈ వ్యవస్థ బాగు చేయనీయదు.

**“యంత్ర యుగము వచ్చే యముడి రాకెట్‌నెక్కి**

వంద ఏళ్ల బతుకు పది ఏళ్లు ఆయెరా!

విశ్వజనుల వాణి వినుర రంగ”.

“హక్కు కొరకు పోరు అసెంబ్లీలన్నీ

ప్రజల కొరకు పోరు వాడెవడు ఇలలోన

విశ్వజనుల వాణి వినుర రంగ”

**(వీటిని 1961లో దాశరథి రాశారు)**

**(‘ఆకాశవాణి’కి కృతజ్ఞతలతో...)**

# జీవితాన్ని చదివి, నేర్చుకొని రాయాలి

*నవలాకారుడుగా, బహు విషయ వ్యాఖ్యాతగా మీరు రూపొందడానికి దారి తీసిన పరిస్థితులేమిటి ?*

ఉద్యమాలే! రచయితలుగా ఆచార్యులు గాని, నిర్దేశకులు గాని నాకెవరూ లేరు. పోరాటమే నేర్పింది. అంత ఎవరూ నేర్పలేరు. పోరాటమే జీవితం అర్థమయేలా చేసింది. నేను జీవితాన్ని నగ్నంగా చూశాను. 'అమ్మ' నవల కూడా ప్రభావితం చేసింది. దేవులపల్లి వెంకటేశ్వరరావు నాయకత్వంలో జనగామలో జరిగిన ప్రజల వీరోచిత పోరాటాల ప్రభావం వుంది. రజనీపామీదత్తు 'ఇండియా టుడే', మినూమసానీ 'అవర్ ఇండియా' కూడా ప్రభావం చూపాయి. అప్పట్లో అమ్మ నవలపై నిషేధం. ఎక్కడో ఒక కాపీ దొరికితే రోజుకొకరు చొప్పున చదివెయ్యాలి. దీపం వెలుగులో చదివేవాళ్ళం. అలాటి ఒక రాత్రి మా ఇంట్లో దొంగలు పడి ఎత్తుకు పోయారు! నేను పోరాటంలో పూర్తిగా ఇన్వాల్వ్ అయ్యాను. ఆ రోజులు అలాంటివి. నాకు 16 -17 ఏళ్ళు ఉంటాయి. నా ఈడువాళ్ళు చాలా మంది పోరాటంలో పాల్గొని ప్రాణాలు పోగొట్టుకున్నారు. అందుకు కారణం నాటి పరిస్థితులా లేక ప్రజా వెల్లువ ప్రభావమా అంటే.... నిజాం నిరంకుశత్వం 300 ఏళ్ళ నుంచి వుంది. అయితే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఉద్యమం వుంది. కాబట్టి అంతటి కదలిక వచ్చింది. తెలంగాణాలో వున్న పరిస్థితులే బీహార్, యు.పి., ఎం.పి. వంటి చోట్ల వున్నాయి. అయినా తిరుగుబాటు రాలేదెందుకని? ఈ మధ్య నేనేదో సభకు వెళ్ళినపుడు లక్నోలో ఎవరో నన్నడిగారు. తెలంగాణాలో కమ్యూనిస్టు

పార్టీ వుండటమే అందుకు కారణమని చెప్పాను. ప్రేమ్‌చంద్ నవలలు చదవండి తెలంగాణా పరిస్థితులే మనకు కన్పిస్తాయి. అందుకే ఆయన రచనలు తెలంగాణా ప్రాంతంలో బాగా ప్రాచుర్యం పొందాయి. అదే కోస్తా ప్రాంతంలో శరత్ సాహిత్యం చదువుతారు. మళ్ళీ పోరాట కాలానికొస్తాను. అప్పట్లో మేము ప్రాణాలు వదలుకోడానికి సిద్ధపడే ఉద్యమంలోకి దూకాం. మా అన్న దాశరథిని అరెస్టు చేసిన నైజాం పోలీసులు ఉదయం పూట తీసుకెళ్ళడానికి జంకారు. ప్రజల నుండి ఆగ్రహం వ్యక్తమవుతుందని, నిజంగా వచ్చేదో లేదో తెలియదు గాని అలా అనుకున్నారు. నన్ను కస్టడీలోకి తీసుకున్నారు. ఖాసిం అని పాకిస్తాన్ నుండి వచ్చిన పోలీసు అధికారి నన్ను బాగా కొట్టాడు. చంపేయాలనుకున్నాడు. కాని వాడు అటు పోగానే అఫ్జల్ అనే పోలీసు నన్ను రమ్మన్నాడు. నేను బతికి వున్నందుకు సంతోషంతో ఫలహారం ప్యాకెట్ ఇచ్చి ఇది నా 'తోఫా' అన్నాడు. కొట్టినపుడు ఏడ్వని నేను ఈ ప్రేమకు చలించి ఏడ్చాను. అలాగే మా వూళ్ళో రజాకార్ల వెంట తిరిగే ఒక యువకుడు నన్ను ఎత్తుకుని ప్రహరీ గోడ దాటించాడు. అలా తప్పించుకున్నాను. ఈ వివరాలన్ని నా ఆత్మకథ 'జీవనయానం'లో రాశాను.

*మోదుగుపూలు, మాయా జలతారు, జనపదం, చిల్లరదేవుళ్ళు వంటి నవలల్లో తెలంగాణా జన జీవితాన్ని అంత చక్కగా చిత్రించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు ?*

ఇన్‌వాల్వ్‌మెంట్, డివోషన్ అంతే. నేను సనాతన కుటుంబంలో పుట్టాను. సంస్కృతం నేర్చుకున్నాను. కమ్యూనిస్టు పార్టీలో చేరాక అవి చదివి తప్పు చేశాననుకున్నాను. అన్నీ మరచిపోయాను. బయటకు వచ్చాక రామాయణ, భారతాలు చదివాను. క్యారక్టరైజేషన్ అంతకన్నా పర్‌ఫెక్ట్‌గా ఎక్కడా వుండదు. వాల్మీకి శైలి నాకెంతో ఇష్టం. గోర్కీ 'అమ్మ' ప్రభావం వుంది. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రభావం పెద్దగా వుందనుకోను. అతని జీవితం కొంత స్ఫూర్తినిచ్చింది. అతన్నుంచి ఏమీ తీసుకోలేదు. 'ప్రజల మనిషి', 'చిల్లర దేవుళ్ళు' కథా కాలం ఒక్కటే. నేను ప్రజల మనిషి ముగిసిన దగ్గర నుంచి ఈ నవల ఎత్తుకుని వుండొచ్చు. కాని అలా చేస్తే వేరే వారి నవలలా వుంటుందనుకున్నాను. నేను తెలంగాణాలో మాట్లాడే భాషలో రచన చేయడం గొప్ప సాహసం. చాలామంది నన్ను ఆ భాషలో రాయవద్దని గొడవ పెట్టారు. మన భాషను చులకన చేయాలని రాస్తున్నావా అన్నారు. అది కేవలం న్యూనతాభావం ఫలితమే. అలా రాసేందుకు

ఎంతమందిని నేను వ్యతిరేకించానో తెలియదు. ఇందాక చెప్పినట్లు ఆ రెండు నవలలది ఒకే కథాకాలం. 1930లో నిజాం కాంగ్రెస్‌ను నిషేధించారు. రాజకీయ కార్యకలాపాలను కూడా. ఆ కాలాన్ని తీసుకున్నాను.

***మీరు తెలంగాణా వాడుక భాషలో రాసినా, రచయిత వర్ణనలు వచ్చినపుడు మామూలు భాషే రాశారు. 'మాయాజలతారు'లో చిన్న చిన్న వాక్యాలు ఎంతో హాయిగా చదివిస్తాయి. భాష విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు ?***

చిల్లర దేవుళ్ళు చదివి డి.వి.నరసరాజు మేమెవరం ఇలా రాయలేం అన్నారు. నేను నవల రాసినా, వేదం రాసినా జనానికి అర్థం కావాలనే కాంక్షతో రాశాను. ఇక శిల్పం, నేను చదివిన ప్రాచీన కావ్యాల ప్రభావం కావచ్చు. నాలో శిల్ప దోషం లేదు. నేను ఏదో యాదృచ్ఛికంగా రచయితను కాలేదు. కావాలని అయ్యాను. నిజానికి నేను కవినై వుండాల్సింది. వట్టికోట ఆళ్వారుస్వామి పోయాడు. ఇక తెలంగాణా గురించి నేను నవలలు రాయకుంటే ఇంకెవరు రాస్తారు? అనే ఆలోచించాను. నవలల గురించి చాలా చదివాను. 'హౌ టు రీడ్ ఎ నావల్' అనే పుస్తకం చాలా శ్రద్ధగా చదివాను. ఆ విధంగా కృషి చేసిన మాట నిజమే. నా శైలిలో స్వతఃసిద్ధంగా అందం వుంటుంది. సూర్యుడు వున్నపుడు కూడా బ్యాటరీ వేసుకుంటామంటే ఎలా? కాళిదాసు సహజ ప్రతిభతో రాస్తాడు. భారవి అలా రాయలేడు. స్వతఃసిద్ధంగా శైలిలో అందం ఉండాలి.

***దోపిడీకి ప్రాతినిధ్యం వహించే పాత్రలను కూడా మీరు సానుభూతితో చిత్రించినట్లు కొన్నిసార్లు అన్పిస్తుంది. ఉదాహరణకు చిల్లర దేవుళ్ళులో దొర... దీనివల్ల దోపిడీదారులపై రావలసిన ఆగ్రహం రాదు కదా ?***

నేను జీవితాన్ని ఏ ఇజం కోణం నుండి చూడలేదు. మనిషిని మనిషిగా సందర్శించాను. 'జనపదం'లో మంగమ్మ గొప్ప లీడర్. ఒక సందర్భంలో కాలు జారుతుంది. ఇలా రాసినందుకు చాలామంది నన్ను విమర్శించారు. అంత గొప్ప వ్యక్తిత్వాన్ని అలా ఎందుకు చిత్రించావని ప్రశ్నించారు. ఎంత గొప్పతనమున్నా మనిషి కదా? మనుషులు తప్పులు చేస్తారు. కమ్యూనిస్టులైనా సరే.. 'నా కాశ్యం, నాపరాధ్యతి' అంటాడు వాల్మీకి,. దోపిడీ వర్గాల పాత్రలను సహజంగానే చిత్రించానే గాని వాళ్ల మీద నేను సానుభూతి

చూపలేదు. కథలో జనం చూపిస్తారు. బలరామయ్య దొర చేసినంత దౌర్జన్యం ఎవరూ చేయలేదు. అయినా ఆయన అవిటి వాడైనప్పుడు జనం 'అయ్యో' అన్నారు. అది మానవ బలహీనత. నేను ఆ పాత్రలను సహజంగా చిత్రించానేమో గాని పోరాటాన్ని చెడగొట్టలేదు.

***తెలంగాణా పోరాటాన్ని చక్కగా ప్రతిబింబించిన మీరు ఆ తర్వాతి పోలీసు చర్యను 'మోదుగుపూలు'లో సమర్థించారు. సైన్యం వచ్చాక కూడా అత్యాచారాలు జరిగాయి కదా ?***

'మోదుగుపూలు' మిలటరీ ప్రవేశిస్తుండటంతో ముగుస్తుంది. అంతే నేను పోలీసు చర్యను సమర్ధించలేదు. 'జనపదం' చదివి, దీన్ని చదివితే అలా అనిపించదు. కథలో రఘు గాంధేయవాది. అయినా తుపాకీ పట్టుకున్నాడు. కానీ తహశీల్దారును కాల్చలేదు. ఇంకోవైపున సైన్యాలు కూడా ప్రవేశిస్తున్నాయి. అలాటి దశలో ముగించాను. అయితే అక్కడ 'భూమి గుండ్రంగా వుంది. ఉద్యమాలు ఎక్కడి నుంచి బయలుదేరాయో అక్కడికే చేరుకున్నాయి. అని నేను రాసిన వ్యాఖ్యను మాత్రం కొంతమంది మిత్రులు విమర్శించారు. 1971 – 72లో ఆనాటి పరిస్థితిలో నేను అలా రాశాను. ఆశావహ పరిస్థితులేమీ లేవు. కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయి ఉంది. ఎక్కడినించి బయలుదేరామో అక్కడకు వచ్చామనిపించింది. అంతేగాని పోలీస్ చర్యలను నేను సమర్థించలేదు. ఆ చర్య భారత పాలకవర్గాల రక్షణ కోసం తీసుకున్నదే గాని ప్రజల కోసం కాదు. హైదరాబాద్ విలీన స్వర్ణోత్సవాల సందర్భంలో నేను ఈ విషయమై రెండు వ్యాసాలు రాశాను.

***చాలా దశాబ్దాల కిందటే మీరు రామాయణం వగైరాలు రాశారు. ఇప్పటికీ వేదాల గురించి రాస్తున్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో సంఘీభావం తెలిపే మీరు సంప్రదాయవాది కూడానా ?***

నేను సంప్రదాయ వాదినని అనుకోను. అయితే అదేమీ నేరం కాదు. నేను సంప్రదాయాన్ని వ్యాఖ్యానిస్తాను. అనుసరించను. నేను సంప్రదాయాన్ని వదిలిపెట్టలేదు. వదిలిపెట్టాలా? దేశం కమ్యూనిస్టు ప్రభుత్వం వస్తే నేను మతాన్ని వదులుకోవడానికి సిద్ధంగానే వుంటాను.

*ఒక సీనియర్ రచయితగా మీ అనుభవం నుంచి సాహిత్య సామాజిక ప్రయోజనం గురించి చెప్తారా ?*

సాహిత్యానికి వున్నదే సామాజిక ప్రయోజనం. (హితం కరోతి సాహిత్యం' విశ్వశ్రేయ–కావ్యం') ఇలాంటి నిర్వచనాలు మనకు ఏనాటి నుంచో వున్నాయి. ఏ రకంగానైనా సమాజానికి మేలు చేసేదే సాహిత్యం. ఇంగ్లీషులో లిటరేచర్ అనే పదానికి అంత విస్తృతమైన అర్థం లేదు. వాళ్లు కంప్యూటర్ లిటరేచర్, సైన్స్ లిటరేచర్ ఇలా అంటూ వుంటారు. భారతీయ సిద్ధాంతం ప్రకారం మనం వాటిని సాహిత్యం అనం. అలాగే క్రైం సాహిత్యం, సెక్సు సాహిత్యం అంటూ వుండవు. వాటిని క్రైం పుస్తకాలు అనొచ్చు. నవలల్లో వ్యక్తివాదం తక్కువ. రచయిత అల్లం రాజయ్య చిల్లరదేవుళ్ళు చదివి, ఆ కథ జరిగిన వూరు చూసేందుకు వెళ్ళి వచ్చాడట. తెలంగాణాలోనే కాదు, బయట కూడా చాలా మంది నా పుస్తకాలు చదివి నాకు రాస్తుంటారు. నా జీవన యానంలో అవన్నీ రాశాను. వేదంలో ఏం లేదనేవాళ్ళు, అన్నీ వున్నాయనే వాళ్లు, ఎవరూ వాటిని చదవలేదు. వాటిలో కులం లేదు, మతం లేదు, వసుధైక కుటుంబం అన్నారు.

*వాస్తవంగా ఏముందనే ప్రశ్న ఒకటి. సామాజికంగా గతంలో అవి నిర్వహించిన పాత్ర, ఈనాడు చాంధస శక్తులు వాటిని ఉపయోగించుకుంటున్న తీరు కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి కదా ?*

స్వప్రయోజనపరులు ఏం చెప్తారనేదాన్ని బట్టి మనం ప్రతిస్పందిస్తే ఎలా? రామాయణం, భారతం అద్భుతమైన కావ్యాలు. భారతంలోనైతే ఇంకా దేవతలు, మనుషులు కలిసి సమాజం కోసం పని చేయడం కనిపిస్తుంది. మనం వాటిని చదవకుండానే ఏవగింపు, అసహ్యం డెవలప్ చేసుకున్నాం. గాంధీ గారొక్కరే రాముణ్ణి సరిగ్గా ఉపయోగించుకున్నారు.

*రామాయణం రాసి రాముడికి అంకితమిచ్చిన మీరు ఈనాడు 'రామజన్మభూమి' పేరిట జరుగుతున్న తతంగాన్ని ఏమంటారు ?*

రాముణ్ణి వాళ్ళు రాజకీయంగా వాడుకుని ఓట్లు పొందుతున్నారు. వాళ్ళని తగినంతగా ఎక్స్‌పోజ్ చేయలేకపోయాము. భారత ధర్మం మీద బి.జె.పి. వాళ్ళకు వున్నంత వ్యతిరేకత ఎవరికీ లేదు. ఈ సమాజం నినాదాల వెనక పోతుంది. చదివే ఓపిక ఎవరికీ

లేదు. 'సామాజిక పరిణామంలో నడకే గాని పెద్ద అంజలు ఉండవని' కృష్ణమీనన్ ఒకసారి చెప్పాడు. టర్కిష్ భాషలో 'హిందూ' అంటే దొంగ అని అర్థం. 'హిందుస్థాన్' అనే మాట ఎక్కడా లేదు. అయినా ఈనాటికి మనం దాని నుంచి బయటపడలేదు. భారత్ అనకుండా వాజ్‌పేయి కూడా ఇండియా అంటూ వుంటారు. రాజకీయ ప్రయోజనాలకు శుష్క నినాదాలు బాగా పనికొస్తాయి. యాభై ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత గతంలో లేని కుల మతతత్వాలు ఈ దేశంలో ప్రబలడానికి అదే కారణం. కమ్యూనిస్టులు బలంగా లేకపోవడం, అనైక్యత, ఇతర కారణాలు క్లింటన్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేయడం నాకు ఎంతో సంతోషం కలిగించింది.

*అయితే ఇప్పటికీ తెలుగులో గొప్ప నవల రాలేదన్న అభిప్రాయంపై మీ ప్రతిస్పందన ?*

నేను ఏ మాత్రం ఒప్పుకోను. ఒక సభలో కొమ్మూరి వేణుగోపాలరావు అలాగే అన్నాడు. నేను జోక్యం చేసుకుని ఖండిస్తూ మాట్లాడాను. నవల అంటే ఒక జాతికి ప్రతీక. నవల సామాజిక సాహిత్యానికి ప్రతీక. మంచి నవల రాలేదనడం జాతిని తక్కువ చేయడమే. మనకు డెబ్బై ఏళ్ళ క్రితమే 'మాలపల్లె' వంటి మహా నవల వచ్చింది. అందుకని ఇవన్నీ స్లోగన్స్. ఇలా అనే వాళ్ళు ఆ నవలలు చదవలేదు. 'మాలపల్లె' గురించి మనం గర్వంగా వుండొచ్చు. రావిశాస్త్రి, వాసిరెడ్డి సీతాదేవి, బీనాదేవి ఇలాంటి రచయితలు రాసినవి వున్నాయి కదా. అవే పర్‌ఫెక్ట్ అని కాదు. మన దృక్పథం నుంచి సామాజికంగా ఎంత మంచివనేది ముఖ్యం. శిల్పరీత్యా చూస్తే రావిశాస్త్రి సంపూర్ణ నవల ఏదీ రాయలేదు.

*మరి కుటుంబరావు ?*

నా ఉద్దేశంలో ఆయన ఆరిస్టు కాదు. కథలు కొంచెం మెరుగు. ఆయన నవలలో 'చదువు'ను చెప్తుంటారు. అదైనా శిల్పం మీద శ్రద్ధ చూపిందికాదు. కొన్ని సిద్ధాంతాలు భుజాన వేసుకోవడం వల్ల అవి ఆకర్షించలేవు. కాళీపట్నం రామారావుకు అసలు శిల్పమే లేదు. శ్రీశ్రీని తీసుకోండి తెలంగాణా పోరాటానికి అందరూ స్పందించారు. ఆయన తప్ప. అంతటితో ఆగక నిజాం సంస్థానంలోనూ పని చేశారు. ఆయనేం విప్లవ కవో! అయితే ఆయనకు ఒక నడక వుంది. అది చాలా గొప్పది.

*కవిత్వం, నవల వాటిపట్ల ఆదరణను ఎలా అర్థం చేసుకోవాలంటారు ?*

కార్లయల్ దగ్గర ఈ ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. 'సమాజంలో ఫ్యూడల్‌తత్వం ఎంత ఎక్కువగా వుంటే కవిత్వానికి అంత ఎక్కువ గౌరవం వుంటుంది' అంటాడాయన. మనం అక్కడి నుంచి బయటపడలేదు. ఆంధ్ర జాతి స్థితి అది. ఏమైనా కవిత్వాన్ని ఇగ్నోర్ చేయడానికి లేదు. ఆధునిక సమాజానికి నవల ప్రాతినిధ్యం వహించాలి. వచన రచయితలలో సన్యాసం పొందిన వారిలో నేను మొదటివాణ్ణి. నాకు రావలసిన గుర్తింపు రాలేదని ఆ మధ్యన ఎవరో రాశారు. నేను ఒప్పుకోలేదు. నేను చేసినదానికి మించి ప్రజలు నన్ను గౌరవించారు. సత్కారాలు చేశారు. నా జీవనయానం, ఇప్పుడు వేదం జీవననాదం రచనలకు, పాఠకుల నుంచి ప్రముఖ రచయితల వరకు ఎందరో అభినందనలు తెలియచేస్తున్నారు. అవార్డులు వచ్చాయి. రాలేదన్నది ముఖ్యం కాదు. ప్రాణాలు పోతాయనుకున్నప్పుడే ఉద్యమంలో దూకినవాళ్లం. అవార్డుల కోసం రాయలేదు.

*ఈనాటి యువ రచయితలకు మీ సూచనలు ?*

జీవితాన్ని, సమాజాన్ని చదవండి. నేర్చుకోండి. రాయండి. చదవకుండా, నేర్చుకోకుండా రాయొద్దు. అయితే ఈనాటి యువ రచయితల నుంచి ఏం రాలేదనడం తప్పు. మంచి సాహిత్యం వస్తున్నది. మంచి కథలు, కవితలు వస్తున్నాయి. నవలలు ఆ స్థాయిలో రాని మాట నిజమే. అయినా విమర్శకులు వున్న మంచిని చూపించాలి. అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బి.ఎస్.రాములు వంటి వారు మంచి రచనలు చేస్తున్నారు. నవల రాలేదంటే... పోరాటంలో నుంచి వచ్చిన వాళ్ళు రాయాలి. ఏమైనా సోషలిజం బ్రతుకుతుంది. అదొక ప్రత్యామ్నాయ ఆర్థిక సిద్ధాంతం. జీవన విధానం. సోవియట్ విచ్ఛిన్నమై వుండొచ్చు. 75 ఏళ్ళ తర్వాత ఎందుకు పోయిందని బాధపడటం కాదు. రాక్షసమైన ఈ అమెరికా దాడిని తట్టుకుని 75 ఏళ్ళు నిలబడటంలోని గొప్పను గుర్తించాలి. రేపు మరేదైనా సోషలిస్టు దేశానికి దెబ్బతగలొచ్చు. చరిత్రలో అలాంటి ఆటుపోట్లు సహజం. సిద్ధాంతాల మంచి చెడ్డలు ఆచరణల మీద ఆధారపడి లేవు. అక్షరాలా మార్చు రాసిందాని ప్రకారమే సోషలిజం రాలేదు. కనుక సోషలిజం బ్రతికే వుంటుంది. దానికి చావులేదు.

ఇంటర్వ్యూ: **తెలకపల్లి రవి**

**(2001, 'దర్పణం'సంచిక)**

# "ఆ ఆవేశమే నన్ను నడిపించింది"

తెలంగాణా జీవనాన్ని అమితంగా ప్రేమించిన వ్యక్తి. నైజాం ప్రభువు దాష్టీకాన్ని ప్రశ్నించిన వ్యక్తి. నైజాం కాలంనాటి జన జీవితాన్ని, రైతాంగ పోరాటాన్ని అక్షరబద్ధం చేసి తెలుగు నవలా ప్రపంచానికో కొత్త సరిహద్దును ఏర్పరచినవాడు దాశరథి రంగాచార్యులు. కమ్యూనిస్టుగా వుండటమే తన కిష్టమంటూ వేదాలను, ఉపనిషత్తులను తెలుగు వారికందించిన కర్మయోగి దాశరథి. ప్రజల కోసమే నా సాహిత్యం అని సగర్వంగా ప్రకటించుకోవటమే కాదు అంతే నిరాడంబరంగా మెలిగే వ్యక్తి. ఎనభై ఆరేళ్ల వయసులోను వారిలో చైతన్యం ఎగసిపడే గోదావరిలా ఉరకలేస్తోంది. వారి 'చిల్లరి దేవుళ్లు, మోదుగుపూలు, జనపదం' తెలంగాణా జీవన చిత్రాన్ని ఆవిష్కరిస్తే వారి జీవనయానం ఒక సారస్వత గోపురంలా సాక్షాత్కరిస్తుంది. పాలపిట్ట ప్రత్యేకంగా వారితో జరిపిన పరిచయం నుంచి కొన్ని భాగాలు.

చిన్నప్పట్నించి మీరో పోరాటం చేశారు. మీ నాయనగారితోటి, మీ చుట్టూ వున్న సమాజం తోటి మీ అమ్మగారు పడిన వేదన చూశారు. జీవితమంటే ఒక నిరంతర పోరాటం అని నమ్మి సాగుతూ వచ్చారు. ఈ శక్తి మీకు ఎక్కడ్నించి వచ్చిందను కుంటున్నారు ?

కమ్యూనిస్టు పార్టీ నాకా బలాన్ని, శక్తిని ఇచ్చింది. మా రోజుల్లో చాలా బలంగా వున్న పార్టీ అది. కాంగ్రెస్ పార్టీ అక్కడా, అక్కడా చెదురు మదురుగా వుండేది. ఎందుకంటే మా రోజుల్లో నిజంగా పనిచేసిన వాళ్లు కమ్యూనిస్టులు.

**మిమ్మల్ని ఆ పార్టీ వైపు నడిపించింది ఎవరు?**

ఒకళ్లు అని చెప్పలేను. ఎవరో ఒకళ్లు తీసికెళ్లారు అని చెప్పలేను. ఇక కమ్యూనిస్టు పార్టీ ఆకర్షించటానికి కారణం నైజాం నవాబు. నైజాంను ఎదిరించాలన్నది అసలు బేస్. మా అన్నయ్య జైలులో కూర్చుని రాయనీకుంటే పెద్ద ఉద్యమమే చేశాడు.

**ఉర్దూ షాయిరీని అలవోకగా కోట్ చేస్తూ వుంటారు. ముఖ్యంగా ఇక్బాల్ అంటే మీకు చాలా ఇష్టం కదా?**

"జిస్ ఖేత్‌సే ధభా నహీ ఖానా, ఉస్ ఖేల్ సే ఖర్‌గోషీ కందంకో జలాదో" అన్నాడు ఇక్బాల్. ఏ పొలమయితే దున్నేవానికి తిండి పెట్టదో, ఆ పొలం మొత్తాన్ని కాల్చేయండి అన్నాడు. ఉర్దూని గురించి పలకరించి చాలా రోజులయింది. ఈ రోజు మీరు మళ్లా వాటినన్నిటిని గుర్తు చేస్తున్నారు. ఆ రోజుల్లో ముషాయిరాలుండేవి. గంటలు, గంటలు హోటళ్లలో కూర్చునేది. 'సారా జహాసే అచ్ఛా హిందూసితా హమారా' అన్నాడు ఇక్బాల్. నార్ల చిరంజీవి, జగ్గయ్య, ఆత్రేయ, ఆరుద్ర వీళ్లందరూ ఎంతో ఇష్టంగా ఉర్దూ భాష సౌందర్యాన్ని వింటానికి ఉబలాటపడుతూ వుండేవారు.

**నిజాంను వ్యతిరేకించారు కానీ, ఉర్దూ భాషను వ్యతిరేకించలేదు?**

నిజాంను వ్యతిరేకించాం కానీ, ఉర్దూ భాషేం చేసింది. అది ప్రజలందరిది అని తెలుసుకున్నాను. పోరాటాల్లో ప్రతిచోటా ప్రాణగండమే. భగవంతుడు నాతోటి ఏదో రాయించడానికి బయటపడేశాడు కానీ, ఆ పోరాటాల్లో ఎప్పుడో పోవలసినవాడిని.

**తెలంగాణ చరిత్రని, పోరాటాన్ని నవలగా రాయాలనిపించింది కదా!**

నా తెలంగాణా పడిన కష్టాల్ని అందరికి తెలియజెప్పాలన్న ఒక తపన వుండేది. అందుకే 'చిల్లర దేవుళ్లు' ఐదు వారాలలో పూర్తి చేశాను. నా రచనల్లో నా భాషెప్పుడూ ప్రజల భాషే. ఇంత పోరాటంలో మేమేమి చేశామో ఎవరికి తెలుసు. మీకో సంఘటన

చెబుతాను. పోలీస్ స్టేషన్లోంచి బయటకు దూకి పరిగెత్తి, పరిగెత్తి ఒక స్నేహితుడి ఇంటికి చేరుకున్నాను. పండువెన్నెల సమయం. ఎలా ఏం చేయాలని ఆ ఇంట్లో చర్చ. ఎలా తప్పించుకోవాలన్నది ప్లాన్ చేశారు. ఒక బండి కట్టి పంపిద్దామన్నారు. మంచిదే అన్నారు. అప్పుడు మొదటి మిత్రుడు ఆయన భార్యని తోడిచ్చి పంపించారు. అవి సార్ త్యాగాలంటే. అవిప్పుడు ఎక్కడ వున్నాయి. చెవులు కుట్టించుకుని, జ్యోతిష్యం చెప్పుకునే వ్యక్తి నాకోసం వెతకనారంభించాడు, నేను ఏమయిపోయానో నన్న ఆందోళనతో. నన్ను చూసినప్పుడు ఎంతానందపడ్డాడు (ఈ సంఘటన చెబుతున్నప్పుడు దాశరథిగారి కళ్లలో ఒక తాదాత్మ్యత). మన లక్ష్యసాధన ఏమిటో తెలుసుకుంటే అన్నీ సరిగ్గానే జరుగుతాయి. ఆ రోజుల్లో మాకు లక్ష్యం వుంది.

**మీ తొలి నవల 'చిల్లర దేవుళ్లు'కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది కదా!**

అవును. అప్పుడు డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు అధ్యక్షులు. ఆనాటి సభలో నేనన్నాను "ఇది నా అవార్డు కాదు. తెలంగాణాకొచ్చిన అవార్డు. పోరాటం తెలంగాణా ప్రజలది, భాష తెలంగాణా ప్రజలది, పాత్రలూ తెలంగాణా ప్రజలే. నేను చేసింది ఒక్క కూర్పు మాత్రమే." ఈ మాటల కి బెజవాడ గోపాలరెడ్డి దగ్గర్నించి అందరూ చప్పట్లు కొట్టారు.

**బెజవాడంటే మీకు బాగా ఇష్టం కదా!**

మేము ఖమ్మం వాళ్లం. ఖమ్మంకు వరంగల్ కంటే బెజవాడ దగ్గర. సినిమా చూట్టానికి పొయ్యేది, అంతే (నవ్వు). నైజాంలో తెలుగు మీద నిర్బంధం వుండేది. తెలుగు అక్కడ స్వేచ్ఛగా, హాయిగా ఎగిరే విహంగంలా వుండేది.

**గార్లన్నా మీకు చాలా ఇష్టం కదా!**

గార్ల నాకు జీవితాన్ని నేర్పింది. పోరాటమంటే జీవితమే కదా! సరే ఆ అవగాహనను ఇచ్చింది కమ్యూనిస్టు పార్టీ. అందుకే నేనెప్పుడూ 'ఐ యామ్ ఎ కమ్యూనిస్ట్

ఫస్ట్' అనే చెబుతాను. ఈయన కమ్యూనిస్టు అయితే దేవుడి గుడికి ఎందుకు పోతాడు అనే అపవాదు నామీద పెట్టారు. అయితే వాటికి, వాటికి సంబంధముంటుందని వాళ్లకు ఎలా చెప్పాలి. కమ్యూనిస్టులు దేవుడ్ని నమ్మరని ఎవరు చెప్పారు. మార్క్సు మతం మత్తు మందు అన్నాడని మాట్లాడతారు. 'religion is heart of hearts' అన్నాడాయన. చాలా గొప్పవాళ్లను చదివే అదృష్టం నాక్కలిగింది. ఇప్పటి పోరగాళ్లకు ఎంతమాత్రం మార్క్సు గురించి తెలుసు. 'దాస్ కేపిటల్' పుస్తకం నా దగ్గరుంది. అది చదివాను. కానీ అది అర్థం కావటం చాలా కష్టం. యూరోప్‌లోని అన్ని దేశాలూ వెళ్లగొడితే ఇంగ్లండులో కూర్చొని రాశాడు. England is a real Democratic country. లేకుంటే ఆ పుస్తకం వుండేది కాదు. ఆ 'ఇజం' వుండేది కాదు. బ్రిటిషు వాడు మనకంత క్రూరుడుగా కన్పిస్తాడు కానీ, he is so democratic.

**వట్టికోట ఆళ్వారుస్వామి మీకు దగ్గర కదా!**

చాలా దగ్గరవాడు. చాలా దగ్గరవాడు అంటే నిజంగా కమ్యూనిజాన్ని నేర్పి ఆ పోరుకు పొమ్మని చెప్పినవాడు ఆళ్వార్‌స్వామి. ఇంకోటి ఆళ్వార్‌స్వామి మొదట రాసుంటే నేను రాయకపోయేవాడిని. నేను పేరు కోసం రాసినవాడిని కాదు. ఇవన్నీ త్యాగాల కథలు. పేరు రావాలని, డబ్బు రావాలని ఇవేవీ ఆలోచించలేదు. చార్లెస్ డికెన్స్ 'TALE OF TWO CITIES' నవలలో అసలు ఫ్యూడలిజం అంటే ఏమిటి, అందులోంచి పోరాటం ఎలా పుట్టిందో రాస్తాడు, చాలా గొప్ప పుస్తకం. అయితే నన్ను ప్రభావితం చేసింది గోర్కీ 'అమ్మ'. ఆ రోజుల్లో ఆ పుస్తకమిక్కడ నిషేధం. రాత్రిళ్లు చదివేవాడిని. బెజవాడ నుంచి తెచ్చి, చదువుకొని ఇచ్చేసేవాడిని. నేను మెట్రిక్యులేషన్ చదివింది అక్కడ్నించే. కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం అక్కడే వుండేది. ఇవికాక ముందు చిన్నప్పుడు కూడా బెజవాడ ఊరికే పోయేది.

**మీకూ, మీ అన్నయ్య దాశరథి కృష్ణమాచార్యకి వుండే రిలేషన్ ఎలా వుండేది!**

ఇద్దరివి ఒకటే ఆలోచనలు. ఆయనది కవిత్వం. నాది వచనం. పొయిట్రీ ఇద్దరం రాసేవాళ్లం. వచ్చిన గొడవది. ఒకసారి సత్తెనపల్లిలో ప్రేమ్‌చంద్ పుట్టిన్రోజు

సందర్భంగా ఒక సమావేశం జరిగింది. నేనూ, గజ్జెల మల్లారెడ్డి, ఆ ఊరులోని ఒక ప్రముఖుడు (పేరు గుర్తుకు రావటం లేదు) మాట్లాడాము. ఒక కుర్రాడొచ్చి మీరు పొయెం గురించి చెప్పాలి అన్నాడు. అది నేను రాసింది కాదు అని చెప్పాల్సి వచ్చింది. తర్వాత పేపర్లలో కూడా అలాగే రాశారు. అప్పుడన్నగారితో అన్నాను, నువ్వు 'పొయిట్రీ' రాయి, నేను 'ప్రోజ్' రాస్తాను అని. అన్నదమ్ములుగా కూడా మేమేరోజు పోట్లాడుకోలేదు. మా అన్నయ్య గొప్ప సోషలిస్టు. ఆస్తిమీద వాటి మీద నమ్మకం లేనివాడు. నాకూ నమ్మకం లేదు. ఆయనకూ నమ్మకం లేదు. నేను ఆవేశపరుడ్ని. ఆవేశం లేకపోతే ఏం చేస్తారు మీరు? ఏం సాధిస్తారు? ఆవేశం లేకపోతే 18 ఏళ్ల ప్రాయంలో తుపాకి పట్టుకుని అండర్‌గ్రౌండ్‌లోకి ఎలా పోగలుగుతాను! ఒక వ్యక్తిని చూడటం కోసం నేను వెళ్లినప్పుడు, నా కళ్లముందు కాల్చి పడేశారు. ఓ అని ఏడ్చి పడిపోవాలి. దానిక్కూడా అవకాశం లేదు. 'మోదుగుపూలు' నవలలో దీన్నో సన్నివేశంగా మలిచాను.

**జీవనయానం రాయటం వెనక కారణం?**

సంపాదకులు ఎబికె ప్రసాద్‌గారు నన్ను 'నువ్వు ఆత్మకథ రాయకపోతే అది దేశానికి ద్రోహమే' అని మందలిస్తూ వుండేవాడు. ఖమ్మంలో జరిగిన ఒక సభలో దీన్ని బహిరంగంగా ప్రస్తావించారాయన. సమాజ జీవనాన్ని, చలనాన్ని ప్రతిఫలించేది నవల. అలాంటి పది నవలల్ని తెలుగులోంచి ఎంపిక చేస్తే ఐదు దాశరథి రంగాచార్యవే అన్నాడాయన. కాబట్టి ఆత్మకథను రాయమని ఎక్కడ చెప్పినా దాశరథి వినటం లేదు, ఈ సభ మీ ఊరిలో జరుగుతోంది, ఆయనతోటి రాస్తానని ప్రమాణం చేయించండి అని అడిగాడాయన. అయితే నేను మాత్రం 'నేను రచయితని. అత్యధిక స్వేచ్ఛ వున్నవాడిని. నాకేది రాయాలని తోస్తే అది రాస్తాను' అన్నాను. కానీ ప్రసాద్‌గారు పట్టుబట్టడం వల్లే అది సాధ్యమయింది. మొఘల్ చక్రవర్తి బహదూర్‌షా జఫర్ గొప్ప కవి. అతనోసారంటాడు 'బేఖయిఫ్ జిందగీ హై జియే జారహాహూ, షీ షా హై ఖాళీ ఫిర్ భి పియే జారహాహు' అంటే అర్థమేమిటంటే జీవితం రసహీనమయింది. అయినా జీవిస్తున్నాను. గ్లాసు ఖాళీగా వుంది. అయినా తాగేస్తున్నాను. అతనే ఇంకోచోట అంటాడు "నీ దేశంలో నిన్ను బొంద పెట్టడానికి ఆరు గజాలు చోటు కూడా నీకు దొరకలేదు" అని.

**ఇప్పటి తరానికి మీరు చెప్పే మాట?**

లక్ష్యాన్ని, గమ్యాన్ని స్పష్టంగా ఏర్పరచుకున్నట్లయితే, జీవితం ఆనందం గానూ, ఆహ్లాదంగానూ వుంటుంది. కేవలం ధన సంపాదన లక్ష్యం కాబోదు అని నేటితరం గుర్తించాలి. అసలు లక్ష్యం అంటే ఏమిటి? అది ఎలా ఉండేది అని నేటి తరానికి తెలియకపోవటం ఒక బాధ.

**మీ శ్రీమతి కమలగారి గురించి చెప్పండి?**

నా అన్ని కష్టాల్లోనూ నా వెనక నిలబడి నన్ను నడిపించింది. ఎక్కడికి వెళ్లినా ఇద్దరం కలిసే వెడతాం. నా సాహితీ సృజనకు అండగా నిలిచింది. నాకు స్నేహితులెక్కువ. అభిమానులెక్కువ. ముప్పైఎనిమిది వేల పేజీల సాహిత్యాన్ని రాశాను. ఇది కాకుండా ఉద్యోగం చేస్తూ ఉద్యమాలు చేశాను. మునిసిపాల్టీలో ఉద్యోగం చేయడమే ఒక బెదురు. అలాంటిది అక్కడ ఉద్యమాలలో పైవాడు అదిరిపోయాడు కానీ, నేనదిరిపోలేదు. స్వచ్ఛమయిన మనసుండాలి. మనమనుకున్నది స్పష్టంగా చెప్పాలి. అప్పుడు లక్ష్యం చేరటం సులభం. వేదం, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, పది నవలలు, కొన్ని ఉర్దూ అనువాదాల్ని చేయగలిగాను. 'ఉమ్రావ్ జాన్ అదాయే' (జిలానీ బానోది) తెలుగులోకి తెచ్చాను. ఇక్బాల్‌ని ఈ మధ్య తెలుగులోకి తెచ్చాను. ఇలా ఏం చేసినప్పటికీ తను తోడుగా ఉండటం వల్లనే సాధ్యమయింది.

**మీ చివరి పుస్తకం ఏది?**

చివరి పుస్తకం అని ఎట్లంటం (రాయడం ఆపేస్తే కదా అన్న చిరు కోపం ధ్వనించింది). అయితే ఇప్పటివరకయితే ఇక్బాల్ అనువాదమే. నేను రాయటమే కానీ నేను చెబుతూ వుంటే ఇంకెవరో రాయటం ఉండదు. ఒకసారి రాయించాను కానీ, రాయిస్తే మన లిపి, శైలి రాదు అని తెలిసింది (ఈ ఇంటర్వ్యూ జరుగుతున్నప్పుడు ఆయన షుగర్ మందు వేసుకోవలసిన సమయాన్ని ఆయన మర్చిపోలేదు. గుర్తు చేస్తూనే వున్నారు).

**అవార్డుల గురించి ఏమయినా చింత వుందా?**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇవ్వగలిగినన్ని అవార్డులిచ్చింది. రాని వాటి గురించి బాధలేదు. నేను డబ్బు కావాలని, పేరు కావాలని రాయలేదు. ప్రజల కోసం రాశాను. ప్రజలు మెచ్చారా లేదా అన్నది మీరు చెప్పాలి. రాజకీయ కారణాలతో ఇచ్చే అవార్డులను నేను వ్యతిరేకిస్తాను. ఒకసారి ప్రయత్నం చేశారు కాని తీసుకోలేదు కూడా.

**మీకు బాగా సన్నిహితులెవరు?**

ఇప్పుడెవరూ లేరు. నా సన్నిహితులందరూ పోయినారు. ఎనభై ఆరేళ్ల వాడిని ఒక్కడ్ని మిగిలాను. అప్పటివాళ్లలో విశ్వనాథ చాలా గొప్పవాడు. ఉన్నదున్నట్టు అనేవాడు. తిట్లు తింటే తినేవాడు. మళ్లీ అదే అనేవాడు. జాషువా, శ్రీశ్రీ, దాశరథి, ఆరుద్ర వీళ్లందరూ గొప్పవాళ్లే. వీరెవ్వరూ ఒకే ఆలోచనతో సాగినవారు కాదు. ఎవరి లక్ష్యం వారిదే. అందులో రాణించారు. అలాంటి వాళ్లు మళ్లీ కన్పించరు.

**మీ దినచర్య ఎలా ఉంటుంది?**

ఉదయం లేవంగానే మొహం కడిగిస్తారు. నాలుగు బిస్కెట్లు తిని టీ తాగుతాను. మా అల్లుడు సురోత్తమాచార్యులు వీల్‌ఛెయిర్‌లో కాసేపు ఇంట్లో తిప్పుతాడు. ఆ తర్వాత స్నానం, పూజ అవీ ఉంటాయి. కాస్త ఇడ్లీ తిని కాస్సేపు విశ్రాంతి. ఎవరయినా వస్తే మాట్లాడ్డం. మళ్లీ ఒంటిగంటకు భోజనం. నాలుగు గంటలకు ఒక యాపిల్. ఎనిమిది గంటలకు భోజనం (పక్క నుంచి ఏదయినా ఆయనకు టైం ప్రకారం ఖచ్చితంగా జరగాల్సిందే అని ముసిముసి నవ్వులు నవ్వుతూ అల్లుడు సురోత్తమాచార్యులు చెప్పారు).

**ఇప్పటికి రాయాలనుందా?**

రాయటం మానలేమండీ. కానీ కూర్చోలేను. కోరికలు లేనివాడిని. రాయాలని సంకల్పించినవన్నీ రాయగలిగాననుకుంటున్నాను.

**భవిష్యత్తులో తెలుగు గురించి భయమేమన్న వుందా?**

తెలుగు చచ్చిపోతుందేమోనని చాలా అంటున్నారు. అసలు ఛస్తుందన్న నమ్మకమేమిటి అంటాన్నేను. భాష చావదు. భాషంటే విశ్వాసం. భాష కూడా ఒక విశ్వాసం.

ఎనభై ఆరేళ్ల వయసులో కూడా ఆయన చూపులో తీక్షణత తగ్గలేదు. చెప్పదలచుకున్న అంశాల పట్ల అస్పష్టత లేదు. ఉర్దూ కవుల 'షేర్ల' పరిమళాలు వాడలేదు. శరీరం విశ్రాంతి కోరుతున్నా 'పాలపిట్ట' పాఠకులతో జ్ఞాపకాలు పంచుకోవటానికి ఆ రోజున ఆయన మనస్సు మంచు ముత్యమై తుషార బిందువుల్ని రాల్చింది. వాటిని భద్రంగా హత్తుకుని వారికి నమస్కరించి బయటకు వచ్చాను.

**ఇంటర్వ్యూ: సి.ఎస్. రాంబాబు**

**(పాలపిట్ట, డిసెంబర్ 2013)**

# అవార్డులు

1. చిల్లర దేవుళ్ళ నవలకు 1970లో
   ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు
2. గురజాడ అవార్డు, విశాఖపట్నం – 1997
3. గౌరవ డి.లిట్, కాకతీయ విశ్వవిద్యాలయం – 1998
4. అక్షర వాచస్పతి అవార్డు – యువ కళావాహిని – 1999
5. అన్నపూర్ణ గండపెండేరం అవార్డు, విజయవాడ – 2001
6. సిద్ధార్థ అవార్డు, విజయవాడ – 2001
7. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం స్పెషల్ అవార్డు – 2001
8. అన్నమయ్య ఆధ్యాత్మిక ఆంధ్రరత్న అవార్డు – 2004
9. ఆంధ్రప్రదేశ్ హంస అవార్డు – 2006
10. ఆంధ్రప్రదేశ్ రాజీవ్ ప్రతిభా అవార్డు – 2009
11. అజో–విభో–కందాళం ఫౌండేషన్ – ప్రతిభామూర్తి
    జీవితకాల సాఫల్య పురస్కారం – 2010

# దాశరథి రంగాచార్య రచనలు

**జీ**వితాన్ని సృజనాత్మకంగా మలుచుకున్న విశిష్ట రచయిత దాశరథి రంగాచార్య. 1928లో జన్మించిన వారు సుదీర్ఘమైన జీవన ప్రయాణంలో విభిన్న ప్రక్రియల్లో చేసిన రచనలు అనేకం.

## వాటిలో ప్రధానమైన రచనల వివరాలు

**నవలలు :**

1. చిల్లర దేవుళ్ళు
2. మోదుగుపూలు
3. మాయ జలతారు
4. రానున్నది ఏది నిజం
5. జనపదం
6. సంకల్పం
7. పావని
8. అమృతంగమయ

**ఆత్మకథలు**

1. జీవనయానం
2. యాత్రా జీవనం

**కథల సంపుటాలు**

1. నల్ల నాగు
2. రణరంగం
3. కెరటాలు

**కవిత్వం**

1. జనాగ్రహం
2. రణభేరి

**జీవిత చరిత్రలు**

1. ప్రేమ్‌చంద్
2. బుద్ధ భానుడు
3. శంకర జీవిత సారథి
4. రామానుజ చరితామృతం

**బాల సాహిత్యం**

1. మహాత్ముడు
2. వివేకానంద

**అనువాదాలు**

1. ఉమ్రావ్ జాన్ అదా
2. కేదారం
3. తెలుగులో అఫ్సన
4. సోనార్ బంగ్లా నాటికలు

**విమర్శ**

1. పరిశీలన
2. అక్షర మందాకిని
3. కలం బొమ్మలు
4. వేదిక



కడదాకా ప్రజలకోసమే తన కలాన్ని ఉపయోగించిన ధన్యజీవి డాక్టర్ దాశరథి రంగాచార్యకు నవతెలంగాణా పబ్లిషింగ్‌హౌస్ సమర్పిస్తున్న అక్షరాంజలి ఇది. పుట్టింది అగ్రకులంలోనే అయినా కడుపేదరికం అనుభవించిన దాశరథి ఆనాటి పేదల బ్రతుకులను సంపూర్ణంగా అర్థం చేసుకొని వారి కడగండ్లను కళ్లకు కట్టినట్లు తన రచనల్లో ప్రతిబింబించారు. నిజాం నిరంకుశ పాలనలో దేశ్‌ముఖ్‌ల, జాగిర్దార్ల క్రూర చర్యలను, పచ్చి ఫ్యూడల్ దోపిడీని ప్రజల భాషలో అక్షరరూపం ఇచ్చి ఆ ప్రజలను మేల్కొలపడానికి తన రచనలను సాధనంగా అందించారు దాశరథి. తానూ నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. అలాంటి మహనీయునికి అంజలి ఘటిస్తూ ఈ చిన్న ప్రచురణ.